ఈనాటి
# తెలుగోడు
PRGI-NO-APTEL/25/A2739
EENAATI TELUGODU... Telugu Daily
https://www.eenaatitelugodu.com
సంపుటి-1 | సంచిక -104 | సోమవారం 12 జనవరి 2026 | పేజీలు - 6 | వెల - రూ.. 5
Published From - Vijayawada, Anantapur, Sri Satyasai, Kurnool, Nandyala, Kadapa, Annamayya, Srikakulam, Nellore, chittoor, Tirupati




### విశాఖ బ్రాండ్‌ను దెబ్బ తీస్తే
## సహించేదిలేదు


**జగదాంబ సెంటర్లో మహిళపై దాడి..**

**నిందుతుణ్ణి అరెస్టు చేసిన పోలీసుల్ని ప్రశంసించిన సీఎం..**



**అమరావతి (తెలుగోడు), జనవరి 11 :**

విశాఖపట్నం బ్రాండ్ ఇమేజ్ దెబ్బతీస్తే సహించేది లేదని సీఎం చంద్రబాబు నాయుడు హెచ్చరించారు. ఆదివారం ఉదయం స్థానిక జగదాంబ సెంటర్‌లో మహిళపై దాడి కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ వ్యవహారంపై సీఎం చంద్రబాబు ఆదివారం అమరావతిలో స్పందించారు. ఈ కేసులో నిందితుడిని అరెస్ట్ చేసిన విశాఖపట్నం నగర పోలీసులపై ఆయన ప్రశంసల జల్లు కురిపించారు. స్పష్టమైన ఆధారాలు లేకున్నా ఈ దాడి కేసును ఛేదించారంటూ వారికి సీఎం చంద్రబాబు కితాబు ఇచ్చారు.విశాఖపట్నంలో ఇవాళ(ఆదివారం) ఓ యువతి ఆఫీస్‌కు నడిచి వెళ్తోంది. జగదాంబ సెంటర్‌లో థియేటర్ సమీపంలో ఉన్న రాజాసాబ్ సినిమా పోస్టర్‌ను ఫొటో తీసింది. ఆ సమీపంలో మాలధారణలో ఉన్న వ్యక్తి.. ఆమె వద్దకు వచ్చి గట్టిగా అరవడం ప్రారంభించాడు. తొలుత అతడు సమీపంలోని ఆటో డ్రైవర్లపై అరుస్తున్నాడని భావించింది. ఆ కొద్దిసేపటి తర్వాత.. ఆమె వద్దకు వచ్చి చెంపపై కొట్టి.. నోటికొచ్చినట్లు (మిగతా 2లో)






### శ్రీ సోమనాథ ఆలయం
## ధైర్యానికి ప్రతీక

- విదేశీ దురాక్రమణదారులు పలుమార్లు దండయాత్ర..
- సోమనాథ్ ఆలయ పునర్నిర్మాణాన్ని అడ్డుకున్న శక్తులు ఇప్పటికీ సజీవం..
- ఎన్నిక కుట్రలు చేసినా సోమనాథ్ ఆలయం చెక్కు చెదరలేదు..
- శౌర్యయాత్రలో ప్రధాని నరేంద్ర మోడీ..

**అహ్మదాబాద్ (తెలుగోడు), జనవరి 11 :**

స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత సోమనాథ్ ఆలయ పునర్నిర్మాణాన్ని వ్యతిరేకించిన శక్తులు ఇప్పటికీ సజీవంగానే ఉన్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఆ శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వాటిని ఐక్యంగా, బలంగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. గుజరాత్‌లో మూడ్రోజుల పర్యటనలో భాగంగా సోమనాథ్ ఆలయాన్ని ఆదివారంనాడు ఆయన సందర్శించి పూజలు చేశారు. సోమనాథ్ స్వాభిమాన్ పర్వ్‌లో పాల్గొన్నారు. సోమనాథ్ ఆలయంపై విదేశీ దురాక్రమణదారులు అనేకసార్లు దండయాత్రలు చేశారని, ఆలయ విధ్వంసానికి పాల్పడ్డారని, దోచుకున్నారనీ, అయినప్పటికీ ఈ ఆలయం ధైర్యం, త్యాగాలు, దృఢ సంకల్పానికి ప్రతీకగా నిలిచిందని అన్నారు. దురాక్రమణదారులు కేవలం చరిత్రలో పేజీలకే పరిమితమయ్యారని, సోమనాథ్ ఆలయం మాత్రం (మిగతా 2లో)

### ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగినా అన్ని నియోజకవర్గాల్లో
## గెలుపు వైసీపీదే



**సంస్థాగతంగా మరింత బలపడాలి..**

**స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయఢంకా మోగిద్దాం..**

**కూటమి వేధింపులు నేనూ అనుభవిస్తున్నా.. ఎవ్వరూ భయపడొద్దు..**

**రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి..**

> కూటమి వేధింపులు నేనూ అనుభవిస్తున్నా.. కార్యకర్తలు, నాయకులు భయపడొద్దు.. రాబోయే రోజులు మనవే.. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాలు గెలుపొంది ఉమ్మడి అనంతపురం జిల్లా వాసులు జగనన్నకు బహుమతి ఇవ్వాలి..
> ఎంపీ.. పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి

**పుట్టపర్తి (తెలుగోడు), జనవరి 11 :**

ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఇప్పటికిప్పుడు ఎన్నికలు నిర్వహించినా 14 నియోజకవర్గాల్లో వైసీపీ గెలుపు తథ్యమని ఎంపీ మిథున్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం శ్రీ సత్యసాయి జిల్లా కేంద్రమైన పుట్టపర్తిలోని మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా ఎంపీ మిథున్‌రెడ్డి హాజరయ్యారు. ఈసందర్భంగా ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు ఘనస్వాగతం పలికారు. ఈసందర్భంగా కార్యకర్తలనుద్దేశించి మిథున్‌రెడ్డి మాట్లాడుతూ సంస్థాగతంగా మరింత బలపడేందుకు వైసీపీ శ్రేణులు శ్రమించాలన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీ విజయం ఖాయమని మిన్నకుండిపోతే నష్టపోవాల్సి వస్తుందన్నారు. మరి కొద్దిరోజుల్లో వచ్చే స్థానిక (మిగతా 2లో)

## హైకోర్టు బెంచ్ రావడం ఖాయం

**న్యాయవాదుల సమస్యలను పరిష్కరిస్తాం..**

**కర్నూలుకు జిల్లా కలెక్టరేట్ భవనం, హైకోర్టు బెంచ్...**

**నిర్ణయం తీసుకోనున్న చంద్రబాబు, లోకేష్..**

**మంత్రి టి.జి.భరత్**



**కర్నూలు (తెలుగోడు), జనవరి 11 :**

కర్నూలుకు హైకోర్టు బెంచ్ రావడం ఖాయమని ఏపీ పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖల మంత్రి టీజీ భరత్ స్పష్టం చేశారు. ఈ అంశంపై సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్‌తో కలిసి చర్చిస్తున్నామన్నారు. ఈ హైకోర్టు బెంచ్‌ను ఏ, బీ, సీ క్యాంపుల్లో ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపామని తెలిపారు. హైకోర్టు బెంచ్‌తోపాటు కలెక్టరేట్ భవనం కూడా ఏర్పాటు చేస్తామని మంత్రి పేర్కొన్నారు. ఆదివారం కర్నూలులో అడ్వకేట్లు సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో మంత్రి టీజీ భరత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ.. న్యాయవాదుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పవిత్ర పుణ్య క్షేత్రమైన తిరుమలపై చిల్లర చేష్టలు ఇకనైనా ఆపాలంటూ వైసీపీ నేతలకు మంత్రి టీజీ భరత్ హితవు పలికారు. తమ ప్రభుత్వంపై బురదజల్లేందుకు వైసీపీ ఆడిన మద్యం బాటిల్స్ నాటకం బయటపడిందని మండిపడ్డారు. టెక్నాలజీ వినియోగించి.. ఈ బండారం బయటపెట్టామని మంత్రి వివరించారు. ఇలా దొరికిపోతామని వైసీపీ నేతలు ఊహించి (మిగతా 2లో)

## కుప్పం వద్ద ఎయిర్‌క్రాఫ్ట్ హబ్


**కుప్పంలో భారీ ప్రాజెక్టుకు శ్రీకారం..**

**ముందుకొచ్చిన పయనీర్ క్లీన్ యాంప్స్..**

**ఎయిర్ క్రాఫ్ట్ తయారీ, విమానయాన శిక్షణా కేంద్రం ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్..**

**55.47 ఎకరాల భూమి కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ..**

**250 మందికి ప్రత్యక్ష ఉపాధి..**



**కర్నూలు (తెలుగోడు), జనవరి 11 :**

చంద్రబాబు సొంత నియోజకవర్గం చిత్తూరు జిల్లా కుప్పంలో ఓ భారీ పరిశ్రమ ఏర్పాటు కానుంది. రామకుప్పం మండలం మనెంద్రంలో పెట్టబడులు పెట్టడానికి పయనీర్ క్లీన్ యాంప్స్ ప్రైవేట్ లిమిటెడ్ ముందుకొచ్చింది. హంస-3 (ఎన్జీ) టూ సీటర్ ట్రైనర్ ఎయిర్‌క్రాఫ్ట్ తయారీ, నిర్వహణ, విమానయాన శిక్షణ కేంద్రాన్ని ఈ సంస్థ ఇక్కడ నెలకొల్పబోతోంది. సమగ్ర విమాన తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయనుంది.దీనికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పయనీర్ క్లీన్ యాంప్స్ సంస్థకు మొత్తం కు 55.47 ఎకరాల భూమి కేటాయిస్తూ పారిశ్రామిక, వాణిజ్య శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 6వ తేదీన జరిగిన రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి సమావేశంలో ఈ ప్రతిపాదన ఆమోదం పొందింది. ఈ ప్రాజెక్టు ద్వారా 159 కోట్ల రూపాయల పెట్టుబడి రానుంది. 250 మందికి ప్రత్యక్ష ఉపాధి లభిస్తుంది. ఈ కేంద్రం- విమానాల ఉత్పత్తి, నిర్వహణ, విక్రయానంతర సేవలు, పైలట్ శిక్షణను అందిస్తుంది. ఏటా 108 టూ- సీటర్ విమానాలను (మిగతా 2లో)

### భారతీయులకు
## ట్రంప్ మరోషాక్

**వీసాల ఫీజులు భారీగా పెంపు**



**న్యూఢిల్లీ (తెలుగోడు), జనవరి 11 :**

అమెరికా వీసా అందని ద్రాక్షలా పూర్తిగా మారిపోయే పరిస్థితి వచ్చేసింది. ఎందుకంటే అగ్రరాజ్యం వరుసగా తీసుకుంటున్న నిర్ణయాలు చూస్తుంటే ఇక అమెరికా అంటే వద్దే వద్దు అన్నట్లుగా చేసేలా ఉంది ధోరణి. ఇటీవలే వీసా ఫీజు పెంచిన ట్రంప్ ఇప్పుడు మరోసారి బాంబు పేల్చారు. గణనీయంగా యూఎస్ వీసాకు పెరుగుతున్న డిమాండ్ ను దృష్ట్యా మరో కొత్త రూల్ ను మన నెత్తిన రుద్దేశాడు. దీంతో అమెరికా (మిగతా 2లో)

## పవన్....టైగర్ ఆఫ్ మార్షల్ ఆర్ట్స్

**డిప్యూటి సిఎం పవన్ కళ్యాన్‌కు దక్కిన అరుదైన అవార్డు..**

**టైగర్‌ఆఫ్ మార్షల్ ఆర్ట్స్ బిరుదునిచ్చిన గోల్డెన్ డ్రాగెన్ సంస్థ..**

**జపాన్‌లో కత్తి యుద్ధ కళలో ప్రత్యేకత చాటుకున్న పవన్..**



**అమరావతి (తెలుగోడు), జనవరి 11 :**

ఉపముఖ్యమంత్రి, ప్రముఖ నటుడు పవన్ కళ్యాణ్ అంతర్జాతీయంగా అరుదైన గుర్తింపు పొందారు. ప్రాచీన జపాన్ కత్తి యుద్ధకళ అయిన కెన్జుట్సులో ఆయనకు అధికారిక ప్రవేశం లభించింది. మార్షల్ ఆర్ట్స్ లో ఆయనకు మూడు దశాబ్దాలకుపైగా ఉన్న అనుభవం, ఇందులో చేసిన పరిశోధనలు, నిబద్ధతకు ఇది అద్దం పట్టింది. కెనిన్ కై ఇంటర్నేషనల్ స్వోర్డ్ ఇన్ స్టిట్యూషన్ ఆయన ఈ గుర్తింపును ప్రదానం చేసింది. ఈ ఇన్ స్టిట్యూట్ ప్రొఫెసర్ డాక్టర్ సయ్యద్ మహమూద్ సిద్ధిక్ మహమూదీ నుంచి గుర్తింపు పత్రాన్ని అందుకున్నారు. సినిమాల్లోకి రాకముందే పవన్ కళ్యాణ్ మార్షల్ ఆర్ట్స్‌తో తన ప్రయాణాన్ని మొదలుపెట్టారు. చెన్నైలో తన బాల్యంలో కరాటే, ఇతర యుద్ధ కళలలో శిక్షణ పొందారు. ఇందులో టెక్నిక్ ను ఔపోసన పట్టారు. సాంకేతికంగా అత్యుత్తమ స్థాయికి చేరుకున్నారు. శారీరకంగా ఎన్నో అడ్డంకులను అధిగమించారు. జపాన్ సమురాయ్ యుద్ధ సంప్రదాయాలపై పరిశోధన చేశారు.ఆయన యుద్ధ కళల పరిజ్ఞానం సినిమాల్లోనూ ప్రతిబింబించింది. 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి', 'తమ్ముడు', 'ఖుషి', 'అన్నవరం', 'ఓజీ' చిత్రాల్లో యుద్ధ కళలను ప్రదర్శించారు. జపనీస్ సినిమాలకే పరిమితమైన మార్షల్ ఆర్ట్స్ ను తెలుగు సినిమా రంగానికి పరిచయం చేసిన మొట్టమొదటి హీరో ఆయనే. దీనివల్ల ఈ కళలకు అవగాహన, ఆదరణ పెరిగాయి. ప్రత్యేకించి- తమ్ముడు సినిమాలో బాక్సింగ్ లో శిక్షణ పొందే సన్నివేశాల్లో ఆయన నిజంగానే మార్షల్ ఆర్ట్స్ ను ప్రదర్శించారు. పవన్ కళ్యాణ్ మార్షల్ ఆర్ట్స్‌కు చేసిన అంకితభావానికి అనేక చారిత్రక గౌరవాలు దక్కాయి. (మిగతా 2లో)

### జగన్... అమరావతి
## జోలికొస్తే ఊరుకోం

**ఆగ్రహం వ్యక్తం చేసిన ఫార్మర్స్ వెల్ఫేర్ అసోసియేషన్**



**అమరావతి (తెలుగోడు), జనవరి 11 :**

వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఫార్మర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజధాని అమరావతిపై జగన్ వ్యాఖ్యలకు కౌంటర్ స్ట్రాంగ్ ఇచ్చారు. అమరావతి నిర్మాణంపై జగన్ ప్రతిపక్షంలో ఉన్నపుడు ఒకలా, అధికారంలో ఉన్నప్పుడు మరోలా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అమరావతి అభివృద్ధి పనులు జరుగున్నాయని స్పష్టం చేశారు. ఇప్పుడు జగన్ అమరావతి అభివృద్ధిని అడ్డుకునేందుకు ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహించారు. ఇప్పుడు సీఎం ఎక్కడ ఉంటే అదే రాజధాని అని జగన్ అనడం సమంజసమా? అని ప్రశ్నల వర్షం కురిపించారు. ఆదివారం ఫార్మర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశానికి ముఖ్య అతిథిగా మాజీ ఇంటిలిజెంట్ చీఫ్ ఏబీ వెంకటేశ్వరరావు (మిగతా 2లో)

## కోడి పందేలపై హైకోర్టు బిగ్ షాక్

**అయోమయంలో కోడి పందేల నిర్వాహకులు..**

**బరుల వద్ద 144సెక్షన్ అమలు..**

**జంతు హింస, జూదం నిరోధక చట్టం అమలు చేయాలని ఆదేశాలు..**

**అమలు జరగదులే అనే తాత్సారం..**



**అమరావతి (తెలుగోడు), జనవరి 11 :**

ఇంకో రెండు రోజుల్లో తెలుగు లోగిళ్లల్లో సంక్రాంతి పండగ సందడి నెలకొనబోతోంది. దీనికోసం రెండు తెలుగు రాష్ట్రాలు సిద్ధమౌతోన్నాయి. ఇంటి ముందు రంగవల్లులు, కోడిపందేలు, గంగిరెద్దుల ఆటలతో వారం రోజుల పాటు ఏపీ, తెలంగాణల్లో పండగ కోలాహలం ఏర్పడనుంది. తెలుగువారికి సంక్రాంతి పెద్ద పండుగ. కుటుంబ సభ్యుల మధ్య ఆనందోత్సాహాలతో ఈ పండగను జరుపుకోవడానికి స్వస్థలాలకు తరలి వెళ్లడం ఆనవాయితీ.కోస్తా జిల్లాల్లో సంక్రాంతి పండగకు కేరాఫ్ అడ్రస్ గా మారిన కోడి పందేల నిర్వహణపై ఏపీ హైకోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. నిర్వాహకులకు బిగ్ షాక్ ఇచ్చింది. జూదం, జంతుహింస నిరోధక చట్టాలను కఠినంగా అమలు చేయాలని ఆయా జిల్లా అధికార, పోలీస్ యంత్రాంగాన్ని ఆదేశించింది. కోడి పందేలు, పేకాట, ఇతర జూదం తరహా కార్యకలాపాలను అడ్డుకోవాలని సూచించింది. అవసరమైతే 144 సెక్షన్ అమలు చేయాలని స్పష్టం చేసింది.జంతు హింస నిరోధక చట్టం 1960, జూదం నిరోధక చట్టం- 1974 ను కఠినంగా అమలు చేయాలని తెలిపింది. దీనికోసం ఆయా జిల్లాల్లోని అన్ని మండలాల్లో ప్రత్యేకంగా ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని, దీనికోసం ప్రత్యేకంగా బృందాలను ఏర్పాటు చేయాలని హైకోర్టు ఆదేశించింది. ప్రతి సంవత్సరం కూడా సంక్రాంతి సమయంలో హైకోర్టు ఈ తరహా ఆదేశాలు ఇస్తూ వస్తోన్నప్పటికీ అవి అంత సులువుగా అమలు కావట్లేదనే అభిప్రాయాలు వ్యక్తమౌతోన్నాయి. (మిగతా 2లో)

# సోమనాథ ఆలయం ధైర్యానికి ప్రతీక

(మొదటి పేజి (తరువాయి)

చెక్కుచెదరకుండా సమున్నతంగా నిలిచిందని కొనియాడారు. వెయ్యేల తర్వాత కూడా ఆలయంపై జెండా ఎగురుతూనే ఉందని చెప్పారు. భారతదేశ విశ్వాసానికి స్వాభిమాన్ పర్వ్ ప్రతిబింబమని, ఈ ఉత్సవాల్లో పాల్గొనడం తనకు ఒక గొప్ప జ్ఞాపకమని పేర్కొన్నారు. స్వాతంత్ర్యానంతరం సోమనాథ్ ఆలయ పునర్నిర్మాణానికి వల్లభ్‌భాయ్ పటేల్ ప్రతినబూనారని, ఆయన చేసిన ఆలయ పునర్నిర్మాణ ప్రయత్నాలను కొందరు అడ్డుకున్నారని విమర్శించారు. సోమనాథ్ పుణ్యక్షేత్రాన్ని సందర్శించాలని భారత తొలి రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ అనుకున్నప్పుడు కూడా అభ్యంతరాలు వ్యక్తం చేశారని చెప్పారు. బుజ్జగింపు విధానాలు అనుసరించి కొందరు సోమనాథ్ ఆలయ పునర్నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ తీవ్రవాద ఆలోచనా విధానం ఉన్న వ్యక్తుల ముందు మోకరిల్లారని, ఇవే శక్తులు ఇప్పటికీ మన మధ్య ఉన్నాయని అన్నారు. ఆ శక్తులను ఓడించేందుకు ప్రజలు అప్రమత్తంగా ఉండి ఐక్యమత్యంగా, బలంగా వారి ప్రయత్నాలను తిప్పికొట్టాలన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ మూడు రోజుల పర్యటనలో భాగంగా ఆదివారం గుజరాత్‌లోని ప్రసిద్ధ సోమనాథ్ మహాదేవుడి ఆలయాన్ని సందర్శించారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం సోమనాథ్ స్వాభిమాన్ పర్వ్‌లో భాగంగా నిర్వహించిన శౌర్యయాత్రలో ప్రధాని మోదీ పాల్గొన్నారు. ఈ యాత్ర సందర్భంగా ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. విదేశీ దురాక్రమణదారుల నుంచి సోమనాథ్ ఆలయాన్ని కాపాడుతూ ప్రాణత్యాగం చేసిన వీరులకు గుర్తుగా ఏటా ఈ శౌర్యయాత్రను నిర్వహిస్తుంటారు. ఈ సంవత్సరం కూడా శౌర్యయాత్రను ఎంతో ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సారి ప్రధాని నరేంద్ర మోదీ ఈ యాత్రలో పాల్గొన్నారు. శౌర్య యాత్రలో భాగంగా మోదీ ఆ యోధులకు నివాళు లర్పించారు. ఈ యాత్రకు భారీ సంఖ్యలో హాజరైన ప్రజలు, మోదీ.. మోదీ అని నినాదాలు చేస్తూ ఆయనకు స్వాగతం పలికారు. ఇక ఇక్కడ ఏర్పాటు చేసిన 108 గుర్రాలు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. వాటిని ఈ యాత్ర కోసం ప్రత్యేకంగా తీసుకొచ్చారు. శౌర్య యాత్రలో భాగంగా ఆలయం వైపు వెళ్తున్న మోదీకి అశ్వాలే ఎస్కార్ట్‌గా మారినట్లు ఆ దృశ్యం కనిపించింది. అనంతరం మోదీ సోమ్‌నాథ్ ఆలయానికి చేరుకొని పూజలు నిర్వహించారు.

# అమరావతి జోలికొస్తే ఊరుకోం

(మొదటి పేజి (తరువాయి)

హాజరయ్యారు. ఈ సందర్భంగా ఫార్మర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు మాట్లాడారు. వైసీపీ నేత బొత్స సత్యనారాయణ అమరావతి స్మశానం, ఎడారి అన్నారని.. అందుకనే ఆ పార్టీకి ప్రజలు 11 సీట్లు ఇచ్చి బుద్ధి చెప్పారనన్నారు. రాజ్యాంగానికి భిన్నంగా జగన్ మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తున్నందుకు జగన్‌పై వెంటనే ఏపీ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.
కూటమి ప్రభుత్వం ఏర్పడటానికి కారణం కూడా అమరావతి ఉద్యమమేనని స్పష్టం చేశారు. జగన్ ప్రజల్ని రెచ్చగొట్టేలా మాట్లాడటం సరికాదని చెప్పుకొచ్చారు. జగన్‌కు ధైర్యం ఉంటే 11 మందితో కలిసి అసెంబ్లీకి రావాలని సవాల్ విసిరారు. అధికార పక్షం తప్పులుంటే జగన్ అండ్ కో ఎత్తి చూపాలని సూచించారు. గత ఐదేళ్లు జగన్ ఎక్కడ ఉండి పరిపాలన చేశారని నిలదీశారు. జగన్ ఇల్లు అమరావతిలోనే ఉందని ప్రస్తావించారు. 2015లోనే అమరావతిపై గ్రీన్ ట్రిబ్యునల్‌లో జగన్ కేసు వేయించారని గుర్తు చేశారు. అమరావతికి గ్రీన్ ట్రిబ్యునల్ క్లీన్‌చిట్ ఇచ్చిందని తెలిపారు. అమరావతిలో రెండో ల్యాండ్ పూలింగ్‌పై తమకు వ్యతిరేకత లేదని పేర్కొన్నారు. వైసీపీ మాజీ ఎంపీ నందిగం సురేశ్ కూడా అమరావతిలోనే ఉంటున్నారని ప్రస్తావించారు. జగన్ ఇలానే నడుచుకుంటే రాజకీయ సమాధి కట్టడానికి రాజధాని మహిళలు సిద్ధంగా ఉంటారని హెచ్చరించారు. జగన్‌ని మోసపు రెడ్డి అని అనొచ్చని ఎద్దేవా చేశారు. జగన్ బటన్ నొక్కడమే పరిపాలన అనుకున్నారని విమర్శించారు. జగన్ సగం సగం మాట్లాడతారని, తర్వాత సజ్జల రామకృష్ణారెడ్డి వచ్చి మాట్లాడతారని సెటైర్లు గుప్పించారు. సో కాల్డ్ అనే పదం జగన్ మానుకోవాలని.. లేదంటే తగిన విధంగా బుద్ధి చెబుతామని హెచ్చరించారు. అమరావతి పేరు చెప్పడానికే కూడా జగన్ ఇష్టపడడం లేదని వారు మండిపడ్డారు.

## మయన్మార్ నుంచి తెలుగువారు

# సురక్షితంగా స్వదేశానికి



**న్యూ ఢిల్లీ (తెలుగోడు ), జనవరి 11 :**

విదేశాల్లో ఉద్యోగాల పేరుతో మోసపోయి, మయన్మార్ సరిహద్దుల్లో సైబర్ మాఫియా చేతిలో చిక్కుకున్న భారతీయుల కథ సుఖాంతమైంది. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తీసుకున్న వేగవంతమైన చర్యల వల్ల బాధితులు సురక్షితంగా ఢిల్లీ చేరుకున్నారు. మంచి ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించి కొంతమందిని ఏజెంట్లు విదేశాలకు తీసుకెళ్లారు. అక్కడి నుంచి వారిని అక్రమంగా మయన్మార్ సరిహద్దుల్లోని సైబర్ క్రైమ్ కేంద్రాలకు తరలించారు. అక్కడ వారిని గదుల్లో బంధించి, శారీరకంగా హింసించడమే కాకుండా.. బలవంతంగా సైబర్ నేరాలకు పాల్పడేలా ఒత్తిడి తెచ్చారు. బాధితుల పరిస్థితిని గమనించిన కుటుంబ సభ్యులు.. కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే రామ్మోహన్ నాయుడు రంగంలోకి దిగి చర్యలు చేపట్టారు. రామ్మోహన్ విన్నపంతో తెలుగువాళ్లను భారత్‌కు తీసుకొచ్చింది విదేశాంగశాఖ. బాధితుల గోడు విన్న వెంటనే రామ్మోహన్ నాయుడు.. కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి ఎస్. జయశంకర్‌కు లేఖ రాశారు. విదేశాంగ శాఖ ద్వారా మయన్మార్‌లోని యాంగాన్ భారత దౌత్య కార్యాలయాన్ని అప్రమత్తం చేశారు. బాధితుల విముక్తి కోసం స్థానిక అధికారులను సమన్వయం చేస్తూ, వారిని క్షేమంగా రప్పించే వరకు మంత్రి పర్యవేక్షించారు. కేంద్ర ప్రభుత్వం చేసిన నిరంతర ప్రయత్నాల ఫలితంగా భారతీయులు మాఫియా చెర నుంచి విడుదలయ్యారు. ఢిల్లీ చేరుకున్న బాధితులకు కేంద్ర ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. అక్కడ నుంచి వారిని వారి స్వస్థలాలకు పంపించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ఏపీ అధికారులు పూర్తి చేశారు. ఈ సందర్భంగా బాధితులు, వారి కుటుంబ సభ్యులు కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడుకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. విదేశాల్లో ఉన్న భారతీయుల భద్రత, సంక్షేమం పట్ల మా ప్రభుత్వం అంకితభావంతో ఉందని రామ్మోహన్ నాయుడు వ్యాఖ్యానించారు. ఎక్కడ మన తెలుగువారు ఇబ్బందుల్లో ఉన్నా ఆదుకోవడానికి సిద్ధంగా ఉంటామని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు భరోసా కల్పించారు.

# ఉద్యోగ, ఉపాధ్యాయులకు మోసం

## వైసీపీ ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి ఆగ్రహం

**అమరావతి (తెలుగోడు ), జనవరి 11 :**




కూటమి ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులను మోసం చేస్తోందనివైఎస్సార్సీపీ ఎమ్మెల్సీ కల్పలతా రెడ్డి ఆరోపించారు. డీఏలు, ఐఆర్ ను ప్రకటించి విడుదల చేస్తామని ఇప్పటికీ అందించ లేదన్నారు. ఎన్నికల సమయంలో ఉద్యోగులను మభ్యపెట్టి ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని మండిపడ్డారు. వైఎస్సార్సీపీ ఎమ్మెల్సీ కల్పలతా రెడ్డి తాజాగా మీడియాతో మాట్లాడుతూ.. 'కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఎంతో దోహదం చేశారు. కానీ, ప్రభుత్వం మాత్రం.. వారికి డీఏలు, ఐఆర్ను ప్రకటించి విడుదల చేస్తామని ఇప్పటికీ అందించడం లేదు. వైఎస్ జగన్ హయాంలో సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రభుత్వ ఉద్యోగులకు మేలు చేశారు. కూటమి ప్రభుత్వం మాత్రం ఉద్యోగులను పట్టించుకోవడం లేదు. ఉద్యోగులకు కూటమి ప్రభుత్వం శత్రువుగా మారిపోయింది. టీచర్స్ పట్ల టార్చర్, పోలీసులకు పనిష్మెంట్, సచివాలయంలో లక్ష సమస్యలుగా కూటమి ప్రభుత్వం మారింది. ఉద్యోగులకు ప్రకటించిన మేనిఫెస్టోను కూడా అమలు చేయకుండా తుంగలో తొక్కారు. రూ.34వేల కోట్ల బకాయిలు పెండింగ్ ఉన్నాయి. నాలుగు డీఏలు పెండింగ్లో ఉన్నాయి. ఐఆర్ అందిస్తామని ఇప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. పీఆర్సీ ఇస్తామని ఆ ఊసే లేదు. దీనిపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఇతర మంత్రులు ప్రస్తావించడం లేదు. పీఆర్సీ కమిటీని కూడా ఏర్పాటు చేయకుండా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోంది. ప్రభుత్వ ఉద్యోగులను పీఆర్సీ చైర్మన్ ను కూడా ఏర్పాటు చేయకుండా మభ్యపెడుతున్నారు. గతంలో వైఎస్ జగన్ హయాంలో ఐఆర్ 27 శాతం అందించారు. ప్రభుత్వం ఏర్పాటయ్యాక మొదటి కేబినెట్ మీటింగ్ లోనే నిర్ణయం తీసుకొని ఉద్యోగులకు అందించారు. చంద్రబాబు ప్రభుత్వం మాత్రం.. 16 నెలలు అవుతున్నా డీఏలు అందించడం లేదు. వైఎస్ జగన్ కరోనా సమయంలో కూడా ఐఆర్, డీఏలు, పీఆర్సీ అందించారు. మూడు లక్షల కోట్ల రూపాయలు అప్పు చేసిన కూటమి ప్రభుత్వం.. ఉద్యోగులకు ఎందుకు బకాయిలు చెల్లించలేదు?. సచివాలయ ఉద్యోగులకు కూటమి ప్రభుత్వం వేధింపులకు పాల్పడుతున్నారు. కూటమి ప్రభుత్వంలో ప్రభుత్వ ఉద్యోగులు ఆందోళన చెందుతున్నాని ఆమె వివరించారు.

# గెలుపు వైసీపీదే



(మొదటి పేజి (తరువాయి)

సంస్థల ఎన్నికల్లో అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో క్లీన్‌స్వీప్ చేసేందుకు ప్రతి ఒక్కరూ కష్టపడాలన్నారు. చాలామంది వైసీపీ శ్రేణులు కూటమి నాయకుల దౌర్జన్యకాండకు బలవుతున్నారన్నారు. వారిలో నేనుకూడా వారి వేధింపులను అనుభవిస్తున్నానన్నారు. చంద్రబాబునాయుడు వైసీపీ నాయకులను, కార్యకర్తలను ఎన్ని వేధింపులకు గురిచేసినా, ఎన్ని కేసులు బనాయించినా భయపడేప్రసక్తే లేదన్నారు. కూటమి క్రూరత్వానికి కష్టాలపాలవుతున్న ప్రతి వైసీపీ నాయకులు, కార్యకర్తలకు జగనన్న అండగా వుంటాడనీ, ఎవ్వరూ భయపడొద్దని తెలిపారు. కూటమి పాలనలో ప్రజలు విసిగి వేజారుతున్నారనీ, రాబోయే రోజులు మనవేనని తెలిపారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాలను కైవసం చేసుకుని జగనన్నకు బహుమతి ఇవ్వాలని అన్నారు. ఈకార్యక్రయంలో వైసీపీ టాస్క్‌ఫోర్స్ సభ్యులు రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి, జిల్లాల అధ్యక్షులు వెంకట్రామిరెడ్డి, ఉషశ్రీచరణ్, నియోజకవర్గాల సమన్వయకర్తలు దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి, విశ్వేశ్వర్‌రెడ్డి, సాకేశైలజానాథ్, వై.వెంకట్రామిరెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి, దీపిక, మగ్బూల్‌బాష, ఈరలక్కప్ప, తలారిరంగయ్య, మెట్టుగోవిందరెడ్డి, జోనల్ కోఆర్డినేటర్ చల్లా మధుసూధర్‌రడ్డిరెడ్డి, మాజీ మంత్రి శంకర్‌నారాయణ, టి.డి.క్రిష్ణసుమన్ (కిట్టూ) రెడ్డి, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ వజ్రభాస్కర్‌రెడ్డి, ఆవుటాల రమణారెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.

వడ్డే ఓబన్న జయంతి... పుట్టపర్తిలోని మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి కార్యాలయంలో ఆదివారం వడ్డే ఓబన్న జయంతి వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి వడ్డే ఓబన్న చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. స్వతంత్ర సమరయోధుల్లో గుర్తించుకోవాల్సిన ప్రముఖుడు వడ్డే ఓబన్న అని ఆయన కొనియాడారు. ఈకార్యక్రమంలో దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, వడ్డే రాజు తదితరులు పాల్గొన్నారు.



## ముంబై మూత పడేందుకు

# పది నిమిషాలు చాలు



**ముంబై (తెలుగోడు ), జనవరి 11 :**

ఠాక్రే సోదరుల మధ్య భిన్న సైద్ధాంతిక విభేదాలున్నా దేశానికి ప్రాధాన్యతనిచ్చి ఐక్యంగా నిలిచారని సంజయ్ రౌత్ అన్నారు. ఠాక్రేలు అంటేనే ఒక బ్రాండ్ అని, ఠాక్రేలు ఉన్నంత కాలం మరాఠా ప్రజలకు రక్షణ ఉంటుందని చెప్పారు. మహారాష్ట్ర రాజకీయాల్లో శక్తివంతమైన కుటుంబాల్లో ఒకటైన ఠాక్రేలు ఎన్నికల్లో పరాజయాన్ని చవిచూసినప్పటికీ వారి రాజకీయ ప్రభావం చెక్కుచెదరదని శివసేన (యూబీటీ) సేన సంజయ్ రౌత్ అన్నారు. ఠాక్రేలు అనుకుంటే నిమిషాల్లో ముంబై మూతపడుతుందని ఒక ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన పేర్కొన్నారు. 'ఠాక్రేలను తుడిచివేయడం సాధ్యం కాదు. ఇప్పటికీ ఠాక్రేలు అనుకుంటే 10 నిమిషాల్లో ముంబై మూతపడుతుంది' అని అన్నారు. బీఎంసీ ఎన్నికల నేపథ్యంలో 20 ఏళ్ల తర్వాత ఠాక్రే సోదరులు ఇటీవల తిరిగి చేతులు కలపడంపై సంజయ్ రౌత్ మాట్లాడుతూ, ఉద్ధవ్ ఠాక్రే, రాజ్ ఠాక్రేలు సోదరులని, వారి తల్లులు అక్కాచెల్లెళ్లని తెలిపారు. ఆ రెండు కుటుంబాలకూ తాను మిత్రుడనని, ఠాక్రే సోదరులు తిరిగి కలవడం వెనుక తన పాత్ర ఉన్నట్లయితే అది తన అదృష్టంగా భావిస్తానని చెప్పారు. ఠాక్రే సోదరుల మధ్య సైద్ధాంతిక విభేదాల గురించి మాట్లాడుతూ, శివసేన హిందుత్వ ఐడియాలజీ, కాంగ్రెస్ సెక్యులర్ ఐడియాలజీ ఉన్నప్పటికీ కలిసి పనిచేశాయని, అలాగే ఠాక్రే సోదరుల మధ్య భిన్న సైద్ధాంతిక విభేదాలున్నా దేశానికి ప్రాధాన్యతనిచ్చి ఐక్యంగా నిలిచారని అన్నారు. ఠాక్రేలు అంటేనే ఒక బ్రాండ్ అని, ఠాక్రేలు ఉన్నంత కాలం మరాఠా ప్రజలకు రక్షణ ఉంటుందని చెప్పారు. ఠాక్రే పార్టీల నుంచే మేయర్ ఉంటారని ముంబై ప్రజలకు ఆయన భరోసా ఇచ్చారు. రాజ్, ఉద్ధవ్ వేర్వేరు కాదని, ఒకరేనని, మేయర్ కూడా ఠాక్రే పార్టీల నుంచే ఉంటారని చెప్పారు. ఠాక్రే వర్గాలు ఎప్పటికీ ఏక్‌నాథ్ షిండేతో కలిసి పనిచేసే ప్రసక్తే లేదని తెలిపారు.

ఉత్తుత్తి బెదరింపులే: ఫడ్నవిస్‌ఠాక్రే సోదరులు అనుకుంటే నిమిషాల్లో ముంబై మూతపడుతుందంటూ సంజయ్ రౌత్ చేసిన వ్యాఖ్యలను మహారాష్ట్ర ముఖ్యమంత్రి, బీజేపీ సీనియర్ నేత దేవేంద్ర ఫడ్నవిస్ కొట్టివేశారు. అవన్నీ ఉత్తుత్తి బెదిరింపులేనని అన్నారు. ఏక్‌నాథ్ షిండేను ముంబైలో అడుగుపెట్టనీయమని అప్పట్లో హెచ్చరించారని, కానీ ఆయన 50 మంది ఎమ్మెల్యేలతో రాజ్‌భవన్ వెళ్లి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. బాల్‌ఠాక్రే బతికి ఉంటే అది (ముంబై మూతపడటం) జరగవచ్చేమో కానీ, వీళ్ల (ఠాక్రే బ్రదర్స్) వల్ల మాత్రం కాదని చెప్పారు.

# ప్రారంభమైన గండికోట ఉత్సవాలు

**కడప (తెలుగోడు ), జనవరి 11 :**

కడప జిల్లాలోని ప్రపంచ ప్రసిద్ధి చెందిన గండికోటలో నిర్వహిస్తున్న గండికోట ఉత్సవాలు 2026 ఘనంగా మొదలయ్యాయి. ఈ సాయంత్రం నిర్వహించిన శోభాయాత్రతో ఉత్సవ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఈ యాత్ర గండికోట చారిత్రక, సాంస్కృతిక వైభవాన్ని అద్భుతంగా ప్రతిబింబించింది. పురాతన రాచరిక సంస్కృతిని గుర్తుచేసే రాజకీయ వేషధారణలు, సంప్రదాయ కళారూపాలు, జానపద నృత్యాలు, రంగురంగుల ఆకర్షణలతో శోభాయాత్ర అద్భుతంగా సాగింది. కుటుంబ సమేతంగా తరలివచ్చిన స్థానికులు, పర్యాటకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. శోభాయాత్రలో ఏపీ టూరిజం శాఖ మంత్రి కందుల దుర్గేష్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి శ్రీమతి ఎస్.సవిత, రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సి.ఆదినారాయణ రెడ్డి, కడప టీడీపీ నేత భూపేష్ రెడ్డి, జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి తదితరులు ఈ ఉత్సవంలో పాల్గొన్నారు.
ఈ మూడు రోజుల ఉత్సవాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు, లైవ్ కాన్సర్ట్‌లు మంగ్లి, రామ్ మిరియాల, డ్రమ్స్ శివమణి వంటి ప్రముఖుల ప్రదర్శనలు), డ్రోన్ షో, ఫైర్ క్రాకర్స్, హెలికాప్టర్ రైడ్స్ రూ.3000కి తగ్గించారు. పారాగ్లైడింగ్, బోటింగ్, ట్రెక్కింగ్ వంటి అడ్వెంచర్ యాక్టివిటీలు ఉంటాయి.

# సహించేది లేదు

(మొదటి పేజి (తరువాయి)

బూతులు తిట్టి వెళ్లిపోయాడు. ఈ ఘటనలో ఆమె కళ్ల అద్దాలు పగిలిపోయాయి. ఊహించని ఈ ఘటనతో యువతి భయాందోళనకు గురైంది. అసలు తనను అతడు ఎందుకు కొట్టాడో కూడా తెలియదని ఆవేదన వ్యక్తం చేస్తూ.. జరిగిన ఘటనపై వీడియోలో వివరిస్తూ.. సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. అంతేకాదు.. ఈ ఘటన జరిగిన సమయంలో ఆ పరిసర ప్రాంతంలో ఉన్న వారెవరూ కనీసం స్పందించలేదంటూ కన్నీటి పర్యంతమవుతూ వివరించింది. ఈ జరిగిన విషయాన్ని తన ఆఫీస్‌లోని సహచరులకు ఫోన్ ద్వారా వివరించింది. దాంతో వారంతా జగదాంబ సెంటర్‌కు వచ్చి సదరు యువతిని తీసుకెళ్లారు. అనంతరం ఈ ఘటనపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు జగదాంబ సెంటర్‌కు చేరుకుని.. సమీపంలోని సీసీ ఫుటేజ్‌లను పరిశీలించారు. యువతిపై దాడి చేసిన వ్యక్తిని కొన్ని గంటల్లోనే అరెస్ట్ చేశారు. ఆ తర్వాత అతడిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అయితే దాడి చేసిన వ్యక్తి మానసిక పరిస్థితి బాగోలేదని పోలీసులు వివరించారు. ఈ ఘటనపై సీఎం చంద్రబాబు నాయుడు స్పందించారు.

# హైకోర్టు బెంచ్ రావడం ఖాయం

(మొదటి పేజి (తరువాయి)

ఉండరన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో 11 సీట్లు వచ్చినా వైసీపీ నేతలు మారడం లేదంటూ మంత్రి టీజీ భరత్ అసహనం వ్యక్తం చేశారు. ప్రజలకు దగ్గర అవ్వాలనే ఆలోచన వారికి లేదన్నారు. ఇలాంటి తప్పుడు పనులను తమ ప్రభుత్వం ఏ మాత్రం సహించబోదని కుండబద్దలు కొట్టారు. తిరుమల పవిత్రతను కాపాడేందుకు తమ ప్రభుత్వం పని చేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గవర్నమెంట్ ప్లీడర్ యలమంచి బాలాజీ, ప్రభుత్వ న్యాయవాదులు(పీపీలు), న్యాయవాదులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కుప్పం వద్ద ఎయిర్ క్రాఫ్ట్ హబ్

(మొదటి పేజి (తరువాయి)

ఉత్పత్తి చేయాలని ఈ సంస్థ ప్రాథమికంగా నిర్ణయించింది. దేశీయ, అంతర్జాతీయ పైలెట్ ట్రైనింగ్ ఇన్ స్టిట్యూషన్స్, ఏరో క్లబ్స్ యజమానుల అవసరాలకు అనుగుణంగా ట్రైనర్ ఎయిర్ క్రాఫ్ట్ తయారీ, ఇతర పరికరాలను తయారు చేస్తుందీ సంస్థ. ప్రతిపాదిత కుప్పం విమానాశ్రయం వద్ద భూమి కావాలని గతంలో ప్రభుత్వానికి ప్రతిపాదనలను అందజేసింది. వీటిని ఎస్ఐపీబీ ఆమోదించింది. మొత్తం ప్రాజెక్టు రెండు దశల్లో పూర్తవుతుంది. మొదటి దశలో 28.30 ఎకరాల్లో రూ. 61.11 కోట్ల వ్యయంతో 2027 ఏప్రిల్ నాటికి పూర్తవుతుంది. దీనివల్ల 100 మందికి ఉపాధి లభిస్తుంది. రెండో దశలో 27.17 ఎకరాల్లో 95.04 కోట్ల రూపాయలతో 2030 జూలై కల్లా పూర్తవుతుంది. 150 మందికి ఉపాధిని కల్పిస్తారు. గతంలో హిందాల్కో ఇండస్ట్రీస్ కుప్పంలో దాదాపు 586 కోట్ల రూపాయలతో భారీ పరిశ్రమను నెలకొల్పనున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే.
ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సారథ్యంలో రాష్ట్రంలో అధికారంలో ఉన్న తెలుగుదేశం- జనసేన- భారతీయ జనతా పార్టీ సంకీర్ణ కూటమి ప్రభుత్వం.. పెట్టుబడులను ఆకర్షించడానికి ప్రాధాన్యత ఇస్తోంది. ఈ క్రమంలో ఇప్పటికే విశాఖపట్నం సమ్మిట్ లో వేల కోట్ల రూపాయలతో కూడిన పరస్పర అవగాహన ఒప్పందాలను కుదుర్చుకుంది. వీటిల్లో కొన్ని ఒప్పందాలు కార్యాచరణలోకి వస్తోన్నాయి.

# ట్రంప్ మరో షాక్

(మొదటి పేజి (తరువాయి)

వెళ్లాలి అనుకుంటున్న వారికి తడిచి మోపెడు అయ్యేలా ఉంది ఖర్చు. భారతీయులు ఇంగ్లాండ్, కెనడా, ఆస్ట్రేలియా కంటే ఎక్కువగా అమెరికాకు ఎడ్యుకేషన్ కోసం, జాబ్స్ కోసం వెళ్తున్నారు. హెచ్ 1 బి వీసా ఐటీ ఉద్యోగ అవసరాల కోసం, ఎఫ్ 1 వీసా విద్యార్థుల కోసం, ఎల్ 1 వీసా కంపెనీల అవసరాల కోసం తయారు చేశారు. ఈ వీసాల్లో ప్రీమియం ప్రాసెసింగ్ తీసుకోవడం అంటే మీరు పెద్ద మొత్తంలో డబ్బు ఇచ్చి అప్లికేషన్ వేగంగా ప్రాసెస్ చేయించుకోవడం. ఇప్పుడు ఈ వీసాల ప్రీమియం ప్రాసెసింగ్ ఫీజులు పెంపు భారీగా పెంచింది అమెరికా.
మార్చి 1 నుంచి అమలులోకి.. అమెరికా కొత్తగా హెచ్ 1 బి, ఎల్ 1, ఎఫ్ 1 వంటి ప్రీమియం ప్రాసెసింగ్ వీసాల ఫీజులను పెంచింది. మార్చి 1, 2026 నుంచి హెచ్ 1బి, ఎల్ 1 వీసాల ప్రీమియం ఫీజులు 2,805 డాలర్ల నుంచి 2,965 డాలర్లకు పెంచుతూ ఆదేశాలు జారీ చేసింది. ఇక హెచ్ 1, ఎల్ 1 విద్యార్థి వీసాల ప్రీమియం ఫీజులు 1,965 నుంచి 2,075 డాలర్లకు పెంపు చేశారు. ఇది అమెరికా వెళ్లాలనుకునే భారతీయ విద్యార్థులు, నిపుణులు, ఉద్యోగార్థులకు బిగ్ షాక్. అమెరికా పౌరసత్వ, వలస సేవల విభాగం ద్వారా విడుదలైన ప్రకటనలో 2023-25 మధ్య ప్రపంచంలో వచ్చిన ద్రవ్యోల్బణాన్ని ఈ ఫీజు పెంపుకు కారణంగా చూపించారు. యుఎస్ సిఐ ఎస్ ప్రకటనలో "వీసా ప్రక్రియలో చాలా కీలమైన ప్రీమియం ప్రాసెసింగ్ విధానాన్ని నెక్స్ట్ లెవల్ కు తీసుకువెళ్లడానికి అదనంగా ఫీజు వసూలు చేస్తున్నాం" అని పేర్కొంది


# టైగర్ ఆఫ్ మార్షల్ ఆర్ట్స్

(మొదటి పేజి (తరువాయి)

సాంప్రదాయ జపాన్ మార్షల్ ఆర్ట్స్‌లో అత్యంత గౌరవనీయమైన సంస్థ 'సోగో బుడో కన్రి కై' నుండి ప్రతిష్టాత్మకమైన అయిదో డాన్ అందుకున్న మొట్ట మొదటి భారతీయ సినీ ప్రముఖుడు పవన్ కల్యాణే. జపాన్ వెలుపల సోకే మురమాట్సు సెన్సాయి ఆధ్వర్యంలోని 'తకేడా షింగెన్ వంశం'లోకి ప్రవేశించిన తొలి భారతీయుడు కూడా ఆయనే. ఈ గౌరవం జపానేతరులైన దక్కడం చాలా అరుదు. 'గోల్డెన్ డ్రాగన్స్' సంస్థ పవన్ కళ్యాణ్‌కు "టైగర్ ఆఫ్ మార్షల్ ఆర్ట్సు అనే బిరుదుతో సత్కరించింది. ఈ ప్రపంచ స్థాయి గుర్తింపు పొందిన తొలి భారతీయ సెలబ్రిటీ ఆయనే. భారత ప్రముఖ బుడో నిపుణుడు హాన్షి ప్రొఫెసర్ డాక్టర్ సిద్దిక్ మహమూది వద్ద పవన్ కళ్యాణ్ కెండో అంశాలను అభ్యసించారు. ఆయన మార్గదర్శకత్వంలో కెండోలో పూర్తి శిక్షణతో ఉన్నత సాంకేతిక నైపుణ్యంలో మెళకువలను నేర్చుకున్నారు. శాస్త్రీయ యుద్ధ కళలు, యుద్ధ తాత్వికతలను అందుకున్న కొద్దిమంది భారతీయ ప్రముఖులలో ఒకరిగా నిలిచారు.

# కోడిపందేలపై హైకోర్టు కీలక తీర్పు

(మొదటి పేజి (తరువాయి)



కాకినాడ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో ప్రతి సంక్రాంతికీ జోరుగా సాగే ఈ కోడిపందేలను తిలకించడానికి పొరుగు రాష్ట్రాల నుండి పెద్ద ఎత్తున తరలి వస్తుంటారు. ఎన్నారైలు కూడా ఈ పోటీలను చూడటానికి, ఇందులో పాల్గొనడానికి తమ తమ స్వగ్రామాలకు వచ్చిన సందర్భాలు చాలానే ఉన్నాయి. ఈ నాలుగు రోజుల్లో కోట్ల రూపాయల మేర లావాదేవీలు జరుగుతాయక్కడ.

తెలుగోడు
అనంతపురము
సోమవారం
12 జనవరి, 2026


## హైదరాబాద్ తాడిపత్రి నగరాల నుండి వచ్చిన ప్రత్యేక బృందాలు.. అతి ప్రాచీన శివలింగాన్ని పునరుద్ధరించిన హ్యూమన్ రైట్స్ కమిటీ.. సహాయ సహకారాలు అందించిన స్థానిక భక్తులు.. తాడిపత్రి మాజీ మున్సిపల్ చైర్మన్ పేరం నాగిరెడ్డి క్షేత్రస్థాయి పరిశీలన..

# పురాతన ఆలయం పునరుద్ధరణ చర్యలు

**యాడికి (తెలుగోడు), జనవరి 11 :**
యాడికి మండలం నిట్టూరు గ్రామం నడివద్దున కోనేటిలో వెలసిన అతి పురాతన శివలింతాన్ని ఆదివారం హైదరాబాదు, తాడిపత్రి నగరాల హ్యూమన్ రైట్స్ సభ్యులు గ్రామ పెద్దలు భక్తులు పునరుద్ధరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. యాడికి మండలం నీట్టూరు గ్రామం నడిబొడ్డున ఉన్న కోనేటిలో అతి ప్రాచీనమైన శివాలయం ఉందని, అయితే దాని ఆలనా పాలన చూసేవారు లేకుండా, పూజా పురస్కారాలకు నోచుకోకుండా చాలా కాలం నుండి నిరాదరణకు గురైనట్లు ఓ భక్తుడు సామాజిక మాధ్యమంలో సమాచారం పెట్టాడు. దీంతో స్పందించిన హైదరాబాదులోని హ్యూమన్ రైట్స్ సభ్యులు ఆదివారం తరలివచ్చి ఎరిశీలించారు. నిట్టూరు గ్రామంలో అతి ప్రాచీన శివాలయం కోనేరులో ఉంది. రాతి కట్టడంతో ఉన్న కోనేరులోనే ఓ బావి పురాతన శివలింగం ఉన్నాయి. భక్తులు, స్థానిక ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో కోనేటిని శుభ్రపరిచారు. బావిలో ఉన్న మట్టిని తొలగించి శివలింగాన్ని శుభ్రం చేశారు. అర్చకులతో పాలాభిషేకం తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తాడిపత్రి మాజీ మున్సిపల్ చైర్మన్ పేరం నాగిరెడ్డి. గ్రామ పెద్దలు రామాంజల్ రెడ్డి. రాజారెడ్డి. తదితర గ్రామ పెద్దలు. భక్తులతోపాటు హైదరాబాదు నుండి వచ్చిన పురాతన సేవ సంఘం సభ్యులు. యాడికి తాడిపత్రి తదితర గ్రామాలనుండి భక్తులు శివమాలదారులు పాల్గొన్నారు.


పెద్ద కోనేరులో బయటపడ్డ శివుడికి ప్రత్యేక పూజలు



నిట్టూరు గ్రామంలో పురాతన కోనేరును శుభ్రపరుస్తున్న హైదరాబాదు, తాడిపత్రి నగరాల హ్యూమన్ రైట్స్ సభ్యులు గ్రామ పెద్దలు భక్తులు







పూజా కార్యక్రమంలో పాల్గొన్న తాడిపత్రి మాజీ మున్సిపల్ చైర్మన్ పేరం నాగిరెడ్డి. బావిని శుభ్రపరుస్తున్న భక్తులు. కోనేరు కట్టడంపై చెక్కిన శిల్పాలు

# 13న జేసీ ఫ్యామిలీ ఆధ్వర్యంలో సంక్రాంతి హరితలక్ష్మి ముగ్గుల పోటీలు

**యాడికి (తెలుగోడు), జనవరి 11 :**
జేసీ ఫ్యామిలీ వారి ఆధ్వర్యంలో సంక్రాంతి హరితలక్ష్మి ముగ్గుల పోటీలు ఈనెల 13న నిర్వహిస్తున్నట్లు టిడిపి నాయకులు తెలిపారు. శ్రీ లక్ష్మి చెన్నకేశవ స్వామి ఆలయ ప్రాంగణంలో మంగళవారం ఉదయం 8:30 నుండి యాడికి మండలంలోని మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ముగ్గుల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రధానం చేస్తామన్నారు. ఎమ్మెల్యే జె.సి. అస్మిత్ రెడ్డి సౌజన్యంతో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో మొదటి బహుమతిగా దివాన్ కాట్, బెడ్ యాడికికి చెందిన దాత ఎంఎన్ రాజు అందిస్తారు. రెండవ బహుమతిగా 43 ఇంచుల టీవీ టిడిపి నాయకులు అందిస్తారు. మూడవ బహుమతిగా రిఫ్రిజిరేటర్‌ను యాడికి స్టోర్ డీలర్ల సంఘం వారు అందిస్తారు. 4వ బహుమతిగా వాషింగ్ మిషన్‌ను పెద్దపేటకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ టెన్సింగ్ నాయుడు అందిస్తారు. 5వ బహుమతిగా ప్రెస్టేజ్ త్రీ బర్నర్స్ గ్యాస్ స్టవ్, మిక్సీ, కిచెన్ సెట్‌ను యాడికి జనసేన నేత సునీల్ అందిస్తారు. 6వ బహుమతిగా ఎయిర్ కూలర్‌ను రాయల్ చెరువు రేణుక ఎలక్ట్రానిక్స్ యజమాని వంగనూరు రాజశేఖర్ అందిస్తారు. 7వ బహుమతిగా గ్రైండర్‌ను యాడికి స్టాంపులు సూరి అందిస్తారు. 8వ బహుమతిగా పట్టుచీరను మందాటి దేవేంద్ర నాయుడు, 9వ బహుమతిగా పట్టుచీరను యాడికి సునీత పట్టు వస్త్రాలయం వారు అందిస్తారు. 10వ బహుమతిగా రైస్ కుక్కర్‌ను యాడికి శ్రీ బద్రావతి కాఫీ వర్క్ యజమాని వద్దు రాజశేఖర్ , 11వ బహుమతిగా రైస్ కుక్కర్‌ను యాడికి చంద్రమౌళి ఎలక్ట్రానిక్ వారు, 12వ బహుమతిగా ఇండక్షన్ స్టవ్‌ను యాడికి ఇండ్ల నందగోపాల్, 13వ బహుమతిగా మిక్సీని యాడికి చంద్రశేఖర్ రెడ్డి, 14వ బహుమతిగా కీప్యాడ్‌ను యాడికి మొబైల్ మారుతి సెల్ పాయింట్ నిర్వాహకులు, 15వ బహుమతి గా డిన్నర్ సెట్‌ను కుమ్మెత నాగేంద్ర, 16వ బహుమతిగా ఇస్త్రీ పెట్టెను యాడికి నాగేంద్ర మారుతి ఎలక్ట్రానిక్స్ నిర్వాహకులు అందిస్తారు. కన్సోలేషన్ బహుమతులను దడియాల ఆదినారాయణ, తిరంపురం నీలకంఠ , గుండా నారాయణస్వామి , కూన వెంకటస్వామి అందిస్తారు. 150 మందికి మాత్రమే పోటీల్లో పాల్గొనే అవకాశం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి వచ్చినవారికి యాడికి వెలిగండ్ల ఉపేంద్ర అల్పాహారం ఏర్పాటు చేయిస్తున్నారన్నారు. ముగ్గుల నిర్వహణ ఖర్చులు విశ్వం, రుద్రమ బ్యాచ్ తిప్పారెడ్డి పల్లి ఆది, కడ్డీల నాగేంద్ర, నరేంద్ర డెకరేషన్స్ వారు భరిస్తున్నారన్నారు. టిడిపి కార్యాలయం, యాడికి సెల్ 8074683259 నెంబర్‌కు కాల్ చేసి పేరు నమోదు చేసుకోవాలన్నారు.


ఆదర్శ దంపతులు జడ్పీటీసీ అనంతరాజు శ్రీలక్ష్మిని సన్మానించిన దృశ్యం

# ఘనంగా విశ్వ కుంచిటిగ పరిషత్ 34వ వార్షికోత్సవం

**ఆదర్శ దంపతులుగా రొళ్ల జెడ్పీటీసీ బి.అనంతరాజు శ్రీలక్ష్మి ..**

**రొళ్ల (తెలుగోడు), జనవరి 11 :**
బెంగళూరులో విశ్వ కుంచిటిగ పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం 34వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకోన్నారు. ఈసందర్భంగా 2026 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కుంచిటిగ రత్న, కుంచశ్రీ, కుంచిటిగ శిరోమణి కుంచిటిగ ఆదర్శ దంపతులను అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా రొళ్ళ జెడ్పీటీసీ బి. అనంతరాజు, సతీమణి లక్ష్మీని కుంచిటిగ ఆదర్శ దంపతులుగా ఎంపిక చేసి సత్కరించారు.


2026 నూతన క్యాలెండరు ఆవిష్కరించిన దృశ్యం

# రేనాటి వీరుడు వడ్డే ఓబన్నకు ఘన నివాళులు

**అనంతపురం రూరల్ (తెలుగోడు), జనవరి 11 :**
బ్రిటీష్ వలస పాలకుల ఆగడాలు, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా మొట్టమొదట ఎదురుతిరిగిన రేనాటి యోధుడు వడ్డే ఓబన్న అని ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. అనంతపురంలోని తన క్యాంప్ కార్యాలయంలో ఓబన్న జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆ యోధుని చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వాతంత్ర పోరాటంలో వడ్డే ఓబన్న పోరాటాల గురించి భావితరాల వారు తెలుసుకోవాలన్నారు. ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి సేనాధిపతిగా ఉంటూ బ్రిటీష్ వారికి ఎదురు నిలబడ్డారన్నారు. అంతటి యోధుని గురించి అందరికీ తెలియాలనే ప్రభుత్వం ఆయన జయంతిని రాష్ట్ర స్థాయి కార్యక్రమంగా నిర్వహిస్తోందన్నారు. వడ్డెర్లకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చింది తెలుగుదేశం పార్టీనేనని.. వారి అభివృద్ధి, సంక్షేమం కోసం ఈ ప్రభుత్వం మరిన్ని కార్యక్రమాలు చేస్తుందని ఎమ్మెల్యే తెలిపారు....

# స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న జయంతి

**నివాళులు అర్పించిన టిడిపి నాయకులు ..**

**రొళ్ల (తెలుగోడు), జనవరి 11 :**
మొదటితరం వీరుడు స్వాతంత్ర సమర యోధుడు వడ్డెర జాతి ఆరాధ్య దైవం వడ్డే ఓబన్న గారి 219వ జయంతిని పూరస్కరించుకొని మడకశిర మండలం ఆమిదాల గొంది పంచాయితీ ఎ ఆర్ రోప్పం గ్రామంలో వడ్డే ఓబన్న విగ్రహం దగ్గర జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా అన్నదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరై నివాళులు అర్పించారు. ఈకార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కుంచిటిగ వక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ, క్లస్టర్ ఇంచార్జ్ కోట్ల రంగేగౌడ్, పట్టణ అధ్యక్షులు నాగరాజు, జిల్లా తెలుగు దేశం పార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీ వడ్డే రఘురాం, యూనిట్ ఇంచార్జ్ వి.రామచంద్రుడు, నరసింహారాజు ,కోర్టు నాగరాజు, బూత్ ఇంచార్జ్ పీజీ దానకర్ణ , విద్యా కమిటీ చైర్మన్ రవి, పత్తి కుంట శశి, వడ్డెర నాయకులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



వడ్డే ఓబన్న విగ్రహానికి పూలమాలలు లేసి నివాళులర్పిస్తున్న టిడిపి నాయకులు
అన్నదానం చేస్తున్న రాష్ట్ర వక్కలిగా కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ

# వడ్డే ఓబన్న ఆశయ సాధనకు కృషి

**వడ్డెర సంఘం నాయకుల నివాళులు.**

**రొళ్ల (తెలుగోడు), జనవరి 11 :**
బ్రిటీషువారి గుండెల్లో రైళ్లు పరుగెత్తించిన గొప్ప పోరాట యోధుడు, స్వాతంత్ర్య సమర యోధుడు, రేనాటి వీరుడు వడ్డే ఓబన్న అని, ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. ఎ సింగిల్ విండో కార్యాలయం ఆవరణంలో ఆదివారం వడ్డే ఓబన్న 219 వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు వడ్డెర సంఘం నాయకులతో కలిసి వడ్డే ఓబన్న చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం వడ్డే ఓబన్న పేరున తయారు చేయించిన కేకును కట్ చేసి పంచి పెట్టి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ భరతమాతను బ్రిటీషు వారి బానిస సంకెళ్ల నుండి విడిపించేందుకు తిరుగులేని పోరాటం చేసిన గొప్ప పోరాట వీరుడు వడ్డే ఓబన్న. ఓబన్న తెలుగుజాతికి నిత్య స్ఫూర్తిగా నిలిచే వ్యక్తి. ఇలాంటి గొప్ప వ్యక్తి జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకి,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్,యువమంత్రి నారా లోకేష్ కు ప్రత్యేక ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం లో సింగల్ విండో అధ్యక్షులు దాసిరెడ్డి మండల పార్టీ కన్వీనర్ జీకే ఈరన్న ఏపీఐఐసీ డైరెక్టర్ రామకృష్ణ,మాజీ క్లస్టర్ ఇంచార్జ్ భరత్,యూనిట్ ఇంచార్జ్ వెంకటేష్, బిజెపి మండలాధ్యక్షులు బద్రి నాయక్,నియోజకవర్గ ఎస్సి సెల్ ఉపాధ్యక్షులు కృష్ణమూర్తి, పంచాయతీ అధ్యక్షులు నాగేంద్ర, నారాయణ,వైస్ సర్పంచ్ రాజు బూత్ ఇంచార్జ్ నాగరాజు, మాజీ ఎంపీపీ నరసింహప్ప, నాయకులు హనుమంతరాయప్ప,ప్రదీప్, నాగేంద్ర, తిమ్మరాజు,నారాయణ, అధిక సంఖ్యలో వడ్డెర నాయకులు తదితరులు పాల్గొన్నారు.


వడ్డే ఓబన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న నాయకులు



కేక్ కట్ చేస్తున్న నాయకులు. వడ్డెర నాయకులకు కేక్‌ను తినిపిస్తున్న నాయకులు.

# నేడు గుడ్డుగురికి, కాకిలో కార్యకర్తల ఆత్మీయ సమావేశం

**సింగిల్ విండో అధ్యక్షులు ఎన్.దాసిరెడ్డి**
**మండల పార్టీ అధ్యక్షులు జికె ఈరన్న**
**ఏపీఐఐసి రాష్ట్ర డైరెక్టర్ రామక్రిష్ణ**




రోళ్ల, (తెలుగోడు)జనవరి 11 :
మడకశిర శాసనసభ్యులు, టి.టి.డి బోర్డు సభ్యులు, జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఎం.ఎస్.రాజు, మాజీ శాసనమండలి సభ్యులు, టి.టి.డి రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి లు సోమవారం రోళ్ల మండలంలో పర్యటించనున్నట్లు మండల పార్టీ అధ్యక్షులు జి కె ఈరన్న, సింగల్ విండో అధ్యక్షులు దాసిరెడ్డి, ఏపీఐఐసి డైరెక్టర్ రామక్రిష్ణ తెలిపారు.రోళ్ల మండలం, గుడ్డుగుర్కి గ్రామపంచాయతీ పరిధిలోని తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలతో మధ్యాహ్నం 12.00 గంటలకు ఏర్పాటుచేసిన ఆత్మీయ సమావేశంలోను అలాగే మధ్యాహ్నం 02.00 గంటలకు కాకి గ్రామపంచాయతీ పరిధిలోని తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఏర్పాటుచేసిన ఆత్మీయ సమావేశంలో పాల్గొననున్నారు.కావున ఆ రెండు పంచాయతీ ల నాయకులు కార్యకర్తలు తప్పనిసరిగా ఆయా పంచాయతీ లో జరిగే ఆత్మీయ సమావేశంలో పాల్గొనాలని తెలిపారు.



# ఘనంగా వడ్డే ఓబన్న జయంతి వేడుకలు

అమరాపురం( తెలుగోడు) జనవరి 11
మండల పరిధిలో వీరాపురం గ్రామంలో స్వాతంత్ర సమరయోధుడు వడ్డే ఓబన్న 219 వ జయంతి వేడుకలను వీరాపురం వడ్డెర కుల బాంధవుల ఆధ్వర్యంలో ఆదివారం వైభవంగా ఈ కార్యక్రమంలో భాగంగా వడ్డెర సంఘం ఆధ్వర్యంలో వడ్డే ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి కేక్ కటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వడ్డెర సంఘం నాయకులు శ్రీనివాసులు, గోవిందరాజులు, గోపి, హనుమ, సుబ్బరాజు, చంద్రు, శ్రీనివాసులు మరియు వడ్డెర సోదరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో .వడ్డెర ఆరాధ్య దైవం వడ్డే ఓబన్నజయంతి వేడుకల్లోఅధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. అదేవిధంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. వడ్డే ఓపన్న జయంతి సందర్భంగా పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.




వడ్డే ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వడ్డెర్ల కుల బాంధవులు.





వడ్డే ఓబన్న జయంతి వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న మహిళలు. అమరాపురం పంచాయతీ వైస్ ప్రెసిడెంట్ సిద్దేశ్వర కేక్ తినిపిస్తున్న దృశ్యం.
పాల్గొన్న వడ్డెర్ల సంఘం మహిళలు. పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం



బత్తలపల్లి నాలుగు రోడ్ల కూడలిలో ఓబన్న జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్న దృశ్యం

## ఘనంగా వడ్డే ఓబన్న జయంతి ఉత్సవాలు

**బత్తలపల్లి (తెలుగోడు), జనవరి 11 :** రేనాటి వీరుడు, స్వాతంత్ర సమరయోధుడు వడ్డె ఓబన్న జయంతి వేడుకలను మండలంలో ఘనంగా నిర్వహించారు. ఆదివారం మండల ప్రజా పరిషత్ కార్యాలయము, వడ్డెర కాలనీ, నాలుగు రోడ్ల కూడలిలో ఓబన్న219 వ జయంతి సందర్భంగా చిత్రపటాన్ని ఉంచి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్వాతంత్ర పోరాటంలో ఓబన్న పాత్రను కొనియాడారు. ఈ వేడుకలలో పరిపాలనాధికారి హెచ్.మల్లికార్జున, యస్ రామమోహన్ నాయుడు, డిప్యూటీ మండల పరిషత్ అభివృద్ధి అధికారి, సచివాలయములు, సిబ్బంది, వడ్డెర కులస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నేడు తనకల్లుకు ఎమ్మెల్యే కందికుంట రాక

**తెదేపా కన్వీనర్ తొట్లిరెడ్డి శేఖర్ రెడ్డి..**

**తనకల్లు (తెలుగోడు), జనవరి 11 :** కదిరి శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ సోమవారం తనకల్లు మండలంలో పర్యటించనున్నారు. తనకల్లు చౌడేశ్వరి కల్యాణ మండపంలో ఉదయం 10.00 గంటలకు నిర్వహించనున్న తనకల్లు మేజర్ పంచాయతీ గ్రామ కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ పాల్గొంటారని పార్టీ కన్వీనర్ తొట్లిరెడ్డి శేఖర్ రెడ్డి తెలిపారు. తనకల్లు గ్రామ పంచాయతీ బూత్ కన్వీనర్లు, యూనిట్ ఇంచార్జులు, క్లస్టర్ ఇంచార్జులు, సింగిల్ విండో చైర్మన్లు, మార్కెట్ యార్డ్ చైర్మన్, మాజీ సర్పంచులు, మాజీ ఎంపిటిసిలు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, మహిళలు అభిమానులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఓ ప్రకటన లో కన్వీనర్ శేఖర్ రెడ్డి కోరారు.



## ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

**బత్తలపల్లి (తెలుగోడు), జనవరి 11 :** ఆర్థిక ఇబ్బందులు, భార్య మరణంతో ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని ఉప్పర్లపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. బత్తలపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఉప్పర్లపల్లి గ్రామానికి చెందిన కురే ముత్యాలు (49) ఆర్థిక ఇబ్బందులు, రెండు నెలల క్రితం తన భార్య ఆత్మహత్య చేసుకోవడాన్ని తట్టుకోలేక బాధపడుతూ జీవితంపై విరక్తి చెంది తమ పొలం వద్ద కానుగ చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారన్నారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారన్నారు. ఆదివారం మృతుడి కుమారుడు సంజీవ రాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.





ఎస్సై వలిబాషను సన్మానిస్తున్న టిడిపి నేతలు

## ఎస్సై వలీబాషకు సన్మానం

**అమరాపురం (తెలుగోడు), జనవరి 11 :** అమరాపురం ఎస్.ఐ. వలీబాషను పలువురు టిడిపి నేతలు ఘనంగా సన్మానించారు. తెలుగుదేశం మండల డీలర్ల సంఘం అధ్యక్షుడు తిప్పేస్వామి, మద్దనకుంట మాజీ ఎంపీటీసీ, పంచాయతీ కన్వీనర్ రవి కుమార్, తమ్మడేపల్లి మాజీ ఎంపీటీసీ చంద్రప్ప, తదితరులు పోలీస్ స్టేషన్లో ఎస్సై వలిబాష కలిసి సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఎస్సై వలిబాష మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తనకు సహకారం ఇవ్వాలని కోరారు.

### వడ్డే ఓబన్నకు నివాళులు

**కదిరి (తెలుగోడు), జనవరి 11 :** స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డె ఓబన్న 219 వ జయంతి సందర్భంగా కదిరి ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న వడ్డె ఓబన్న విగ్రహానికి కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కూటమి పార్టీల నాయకులు మాజీ ఎమ్మెల్యే ఎమ్మెస్ పార్థసారథి, జనసేన పార్టీ ఇంచార్జ్ భైరవ ప్రసాద్, కూటమి పార్టీల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## ఫోక్సో కేసులో యువకుడి అరెస్ట్

**బత్తలపల్లి (తెలుగోడు), జనవరి 11 :** బత్తలపల్లి పోలీస్ స్టేషన్లో గత సంవత్సరం నవంబర్ నెల 15వ తారీకున నమోదైన ఫోక్సో కేసులో ముద్దాయిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిఐ ప్రభాకర్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత సంవత్సరం నవంబర్ నెల 15వ తారీఖున ముగ్గురు వ్యక్తులపై ఫోక్సో కేసు నమోదయిందన్నారు. నమోదు కాబడిన ఫోక్సో కేసులో మూడవ ముద్దాయి అనంతపురం నగరం కేకేపల్లి కాలనీకి చెందిన ఈడిగ ప్రదీప్ కుమార్‌ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

### తెల్లవారి గుండెల్లో రైళ్లు పరుగెత్తించిన

# పోరాట యోధుడు వడ్డే ఓబన్న

**తెలుగుజాతి గర్వించదగ్గ స్వాతంత్ర్య సమరయోధుడు.. ఓబన్నను స్మరించుకోవడం మన ప్రథమ కర్తవ్యం.. వడ్డే ఓబన్న ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి .. జడ్పిటిసి ఉమేష్..**



వడ్డే ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న జడ్పిటిసి ఉమేష్

**అగళి (తెలుగోడు), జనవరి 11 :** బ్రిటీషువారి గుండెల్లో రైళ్లు పరుగెత్తించిన గొప్ప పోరాట యోధుడు, స్వాతంత్ర్య సమర యోధుడు, రేనాటి వీరుడు వడ్డే ఓబన్న అని, ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని జడ్పిటిసి ఉమేష్ పేర్కొన్నారు. మండల పరిధిలోని పి బ్యాడిగెర గ్రామంలో వడ్డెర సోదరుల కుల బాంధవ్యుల ఆధ్వర్యంలో ఆదివారం వడ్డే ఓబన్న219వ జయంతిని పురస్కరించుకొని ఆయన జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పిటిసి ఉమేష్ ముఖ్య అతిథిగా పాల్గొని వడ్డెర సోదరుల తో కలిసి వడ్డే ఓబన్న చిత్రపటానికి పూలమాలలువేసి నివాళు లర్పించారు. అనంతరం వడ్డే ఓబన్న పేర తయారు చేయించిన కేకు కట్ చేసి పంచిపెట్టి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భరతమాతను బ్రిటీషు వారి బానిస సంకెళ్ల నుండి విడిపించేందుకు తిరుగులేని పోరాటం చేసిన గొప్ప పోరాట వీరుడు వడ్డే ఓబన్న. ఓబన్న తెలుగుజాతికి నిత్య స్ఫూర్తిగా నిలిచే వ్యక్తి. ఇలాంటి గొప్ప వ్యక్తి జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ కు ప్రత్యేక ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలిపారు. వడ్డెర్ల సంక్షేమానికి పెద్దపీట వేసి,వారికి అవసరమైన నిధులు సమకూర్చుతున్న వ్యక్తి ముఖ్యమంత్రి చంద్రబాబు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వడ్డెర్ల సంక్షమమే ధ్యేయంగా పనిచేస్తూ ఉన్నారని అన్నారు, వడ్డెర్లంతా చంద్రబాబుకు తోడుగా ఉండాలని అన్నారు. కూటమి ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని అన్నారు. వడ్డెర సోదరులు మాట్లాడుతూ ఓబన్న చరిత్రను కొనియాడారు, వడ్డెరల భవిష్యత్తు కార్యాచరణ గురించి తెలియజేశారు, ఓబన్న ఆశయాలను వడ్డెర్ల ఐకమత్యం హక్కుల సాధనకై రానున్న రోజుల్లో ముందుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమం లో జెడ్పిటిసి ఉమేష్ తోపాటు క్లస్టర్ కోకన్వీనర్ కమ్మరి శివన్న, సీనియర్ నాయకుడు డాక్టర్ కృష్ణప్ప, బీసీ సెల్ కార్యదర్శి వడ్డే నరేష్ బాబు,టైలర్ కృష్ణప్ప, రామకృష్ణప్ప,పి.బ్యాడిగెర పంచాయతీ ఎంపీటీసీ తనయుడు సురేష్, బూత్ ఇంచార్జ్ గిరీష్, ఉలిగేష్, తదితర వడ్డెర కుల బాంధవులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.






కేక్ కట్ చేస్తున్న జడ్పిటిసి ఉమేష్. కేక్ తినిపిస్తున్న దృశ్యం

## ఘనంగా వడ్డే ఓబన్న జయంతి ఉత్సవాలు

**గుడిబండ (తెలుగోడు), జనవరి 11 :** గుడిబండలో ఆదివారం వడ్డెర సంఘం నాయకుల ఆధ్వర్యంలో పోరాటయోధుడు వడ్డే ఓబన్న జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వడ్డే ఓబన్న చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక సర్పంచ్ జీబీ కరుణాకర్ గౌడ్, ఎంపీటీసీ వనజ శశిధర్, మైనార్టీ నాయకుడు ఏ షబ్బీర్, వడ్డెర సంఘం నాయకుడు భీమ్ రాజు లు మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధుడు, గొప్ప పోరాట యోధుడు రేనాటి వీరుడు వడ్డే ఓబన్న ఆనాడు బ్రిటిష్ వాళ్లను ఎదిరించి స్వాతంత్ర పోరాటంలో తనదైన ముద్ర వేసుకుని పోరాడిన ఘనత వడ్డే ఓబన్నకి దక్కుతుందన్నారు. ఆనాడు సమాజానికి ఆయన చేసిన సేవలు స్ఫూర్తిదాయకమన్నారు. ఆయన ఆశలను కొనసాగించడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వడ్డెర సంఘం నాయకులు మంజునాథ్, శ్రీనివాసులు, వెంకటేష్, హనుమంతు, అంజమ్మ పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న దృశ్యం

# ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్ర

**నల్లమాడ మండల కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ గౌస్‌బాష..**

**పుట్టపర్తి (తెలుగోడు), జనవరి 11 :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్ర కొనసాగిస్తుందని నల్లమాడ మండల కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ గౌస్ బాషా పేర్కొన్నారు. ఆదివారం పుట్టపర్తిలోని సత్యమ్మ సర్కిల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరాహార దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా గౌస్ బాషా మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం ప్రజల ఆలోచన విధానానికి అనుకూలంగా వ్యవహరించకుండా ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటుందన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల మనసుల నుంచి తొలగించే ప్రయత్నం చేస్తుందన్నారు. అందులో భాగంగానే భారతదేశానికి స్వతంత్రం తీసుకురావడంలో ప్రధాన భూమిక పోషించిన జాతిపిత మహాత్మా గాంధీ పేరుని ఉపాధి హామీ నుండి తొలగించే కుట్ర చేశారన్నారు. 2006 ఫిబ్రవరి రెండవ తేదీన అనంతపురం జిల్లాలోని బండ్లపల్లి లో మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్, దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖరరెడ్డి లో ప్రారంభించారన్నారు. అప్పటినుండి పేదలు ఉపాధి హామీ ద్వారా ఎంతోకొంత లబ్ది పొందుతూ సంతోషంగా జీవిస్తున్నారు. అదేవిధంగా చాలావరకు వలసలు కూడా తగ్గాయన్నారు. అయితే పేదల కడుపు కొట్టే విధంగా కేంద్ర ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటూ ఉందన్నారు. ఉపాధి హామీని పూర్తి నిర్వీర్యం చేసే ఆలోచనతోనే మహాత్మా గాంధీ పేరును తొలగించారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా మన దేశంలో జాతిపితగా గుర్తింపు పొందిన మహాత్ముడి జ్ఞాపకాలను చెరిపి వేయడం సాధ్యం కాదన్నారు. కాంగ్రెస్ పార్టీ పిలుపుమేరకు ఉపాధి హామీ పథకంపై కక్షపూరితంగా వ్యవహరిస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలను ఎండగడుతూ నిరసన కార్యక్రమాలను చేయబడుతున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిసి ప్రెసిడెంట్ షానవాజ్, రాష్ట్ర నాయకులు కోటా సత్యం, నియోజకవర్గ నాయకులు మధుసూదన్ రెడ్డి తదితర కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.



కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ ప్రమాణం చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు




నిరాహార దీక్ష చేపట్టిన కాంగ్రెస్ శ్రేణులు

# ఘనంగా వడ్డే ఓబన్న జయంతి వేడుకలు

**ముదిగుబ్బ (తెలుగోడు), జనవరి 11 :** స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న జయంతి కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. బ్రిటిష్ పాలకుల దౌర్జన్యాలకు ఎదురొడ్డి నిలిచిన వీరుడు వడ్డే ఓబన్న సేవలను స్మరిస్తూ పలు ప్రాంతాల్లో కార్యక్రమాలు జరిగాయి. అందులో భాగంగా ముదిగుబ్బలో తహసీల్దార్ నారాయణస్వామి, టిడిపి క్లస్టర్ ఇంచార్జ్ తుమ్మల మనోహర్ ఆధ్వర్యంలో వడ్డే ఓబన్న జయంతిని పెద్ద ఎత్తున నిర్వహించారు. వడ్డే ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా 1846లో ఉయ్యాలవాడ నరసింహారెడ్డితో కలిసి స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని కీలక పాత్ర పోషించారన్నారు. వడ్డెర, బోయలు, చెంచుల వంటి సంచార తెగలను ఏకం చేసి సుమారు 2000 మంది సైన్యాన్ని ఏర్పాటు చేసిన వడ్డే ఓబన్న, నరసింహారెడ్డి సైన్యాధ్యక్షుడిగా వ్యవహరించారన్నారు. 1857 సిపాయి తిరుగుబాటుకు ముందే దక్షిణ భారతదేశంలో జరిగిన తొలి స్వాతంత్ర్య ఉద్యమంలో ఆయన విశేష సేవలందించారు. బ్రిటిష్ ఖజానాపై దాడులు చేయడం, పాలకుల అణచివేతకు వ్యతిరేకంగా పోరాటాలు చేయడం వంటి చర్యల ద్వారా బ్రిటిష్ అధికారులకు కంటి మీద కునుకులేకుండా చేశారన్నారు. 1846 అక్టోబర్ 6న కర్నూలు జిల్లా పేరుసోముల కొండ వద్ద జరిగిన యుద్ధంలో వడ్డే ఓబన్న వీరమరణం పొందారు. ఆయన త్యాగం భారత స్వాతంత్ర్య పోరాట చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. వడ్డే ఓబన్న సేవలను గుర్తించిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2025 నుంచి ప్రతి సంవత్సరం జనవరి 11న ఆయన జయంతిని రాష్ట్ర పండుగగా అధికారికంగా నిర్వహిస్తోందన్నారు.

ముదిగుబ్బ గ్రామపంచాయతీ కార్యాలయం-1లో స్థానిక వడ్డెర సంఘం ఆధ్వర్యంలో జయంతి వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మార్వో నారాయణస్వామి, ముదిగుబ్బ తెలుగుదేశం పార్టీ క్లస్టర్ ఇంచార్జ్ తుమ్మల మనోహర్ వడ్డే ఓబన్న చేసిన పోరాటాలు, త్యాగాలను స్మరించారు. యువత ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని దేశభక్తి, సామాజిక చైతన్యం పెంపొందించుకోవాలని వారు పిలుపునిచ్చారు.



వడ్డే ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు



వడ్డే ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వడ్డెర సోదరులు

## ఘనంగా వడ్డే ఓబన్న జయంతి

**నల్లమాడ (తెలుగోడు), జనవరి 11 :** నల్లమాడలోస్వాతంత్ర సమరయోధుడు వడ్డే ఓబన్న జయంతి వేడుకలు వడ్డెర సోదరుల ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో వడ్డే ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు జెరిపిటి రవీంద్ర, పల్లపు ప్రతాప్, కుంచపు చంద్ర తదితరులు మాట్లాడారు. దేశానికి స్వతంత్రం కోసం పోరాడిన ప్రముఖుల్లో వడ్డే ఓబన్న ఒకరన్నారు. ఆంగ్లేయుల పాలనను వ్యతిరేకించి భారతదేశానికి స్వతంత్రం తీసుకురావడంలో తొలి రోజుల్లోనే పోరాడిన ధైర్యశాలి వడ్డే ఓబన్న అన్నారు. వడ్డెర సోదరులందరూ ఐక్యంగా ఉంటూ ఓబన్న ఆశయాలను కొనసాగించేందుకు ప్రతిక్షణం ముందుండాలన్నారు. పుట్టపర్తి నియోజకవర్గంలో అత్యధికంగా వడ్డెర ఓటర్లు ఉన్నారని, అన్ని రాజకీయ పార్టీల్లో వడ్డెర్లకు ప్రాధాన్యత కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వడ్డెర సోదరులు నాగభూషణ, చెన్నకేశవులు, నరసింహులు, వెంకటయ్య, అంజి, విశ్వనాథ్, పల్లపు సాయి, గంగరాజు, కిష్ట, నాగేంద్ర, రామాంజి తదితరులు పాల్గొన్నారు.



డ్రోన్ల సాయంలో అసాంఘిక కార్యకలాపాలు గుర్తిస్తున్న దృశ్యం

## అసాంఘిక కార్యకలాపాల నిర్మూలనపై ప్రత్యేక దృష్టి

**డ్రోన్ల ద్వారా పరిశీలన..**

**అమరాపురం (తెలుగోడు), జనవరి 11 :** అమరాపురం మండల పరిధిలోని దేవగానపల్లి పరిసర ప్రాంతాలు, కర్ణాటక సరిహద్దు ప్రాంతాలలోపెనుకొండ డి.ఎస్.పి నరసింగప్ప ఆధ్వర్యంలో మడకశిర రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రాజకుమార్ సమక్షంలో ఆదివారం డ్రోన్ కెమెరాల ద్వారా అసాంఘిక కార్యకలాపాలను గుర్తించే ప్రక్రియ నిర్వహించారు. గ్యాంబ్లింగ్ , పేకాట, ఓపెన్ డ్రింకింగ్ , ఇతరత్రా అసాంఘిక కార్యకలాపాల గురించి తెలుసుకోవడానికి ఆ ప్రాంతంలో డ్రోన్లు వదిలినట్లు పోలీసు అధికారులు తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలు నిర్మూలనకు గ్రామ ప్రజలు కూడా ప్రత్యేక దృష్టి సారించి పోలీసులకు సహకరించాలని డి.ఎస్.పి కోరారు. ఈ కార్యక్రమంలో అమరాపురం పోలీస్ స్టేషన్ ఎ.ఎస్.ఐ. రామాంజనేయులు, మడకశిర హెడ్ కానిస్టేబుల్ రమణ, కానిస్టేబుల్ శ్రీనాథ్ మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



శ్రీజ్యోతి హైస్కూల్‌లో జరిగిన పూర్వ విద్యార్థుల, గురువులు ఆత్మీయ సమ్మేళనం


# శ్రీజ్యోతి హైస్కూల్‌లో పూర్వ విద్యార్థుల సందడి

**జ్ఞాపకాల పందిరిలో ఆత్మీయ సమ్మేళనం**

బత్తలపల్లి (తెలుగోడు), జనవరి 11: పాత జ్ఞాపకాలు పలకరించాయి.. చిన్ననాటి స్నేహాలు చిగురించాయి.. దశాబ్ద కాలం దాటినా చెరగని ముద్ర వేసిన గురుశిష్యుల బంధం మరోసారి ఆత్మీయతకు వేదికైంది. మండల కేంద్రంలోని శ్రీ జ్యోతి హైస్కూల్‌లో 2007-2008 విద్యాసంవత్సరానికి చెందిన పదవ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం అత్యంత అట్టహాసంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాఠశాల కరస్పాండెంట్ మిడతల లక్ష్మీనారాయణ హాజరయ్యారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు శంకరయ్య, ఆంజనేయులు, మల్లికార్జున, రవీంద్ర, ఫ్రాన్సిస్, మరియు హరిలను విద్యార్థులు ఘనంగా సన్మానించి తమ కృతజ్ఞతను చాటుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు తమ పాత జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు.కరస్పాండెంట్ కరస్పాండెంట్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. "చదువుకున్న పాఠశాలను, నేర్పిన గురువులను మర్చిపోకుండా ఈ విధంగా ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేయడం అభినందనీయం. నాడు చిన్న పిల్లలుగా ఈ పాఠశాలలో అడుగుపెట్టిన విద్యార్థులు, నేడు వివిధ రంగాలలో స్థిరపడి ప్రయోజకులుగా మా ముందు నిలబడటం మాకెంతో గర్వకారణం" అని కొనియాడారు.దాదాపు 18 ఏళ్ల తర్వాత స్నేహితులందరూ ఒకే చోట చేరడంతో పాఠశాల ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొంది. విద్యార్థులు ఒకరి క్షేమ సమాచారాలను మరొకరు అడిగి తెలుసుకుంటూ, సెల్ఫీలు దిగుతూ సందడి చేశారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు, కలయికలు కొనసాగించాలని వారు ఆకాంక్షించారు.

## 13న ధర్మవరంలో ముగ్గుల పోటీలు

**మహిళలు పెద్ద ఎత్తున పాల్గొనాలి జనసేన 36వ వార్డు ఇంచార్జ్ కోటిరెడ్డి రాజారెడ్డి..**



**ముదిగుబ్బ(ధర్మవరం) (తెలుగోడు), జనవరి 11 :** సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ధర్మవరం పట్టణంలో మహిళలకు ఉత్సాహభరితమైన ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు జనసేన పార్టీ 36వ వార్డు ఇంచార్జ్ కోటిరెడ్డి రాజారెడ్డి తెలిపారు. పోతుకుంట రోడ్డులోని అన్నపూర్ణేశ్వరి దేవి దేవాలయం ఎదురుగా ఉన్న నూతన జనసేన పార్టీ కార్యాలయం ఆవరణంలో ఈ పోటీలు జరగనున్నాయని వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 13వ తేదీ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం వరకు ముగ్గుల పోటీలు ప్రారంభమవుతాయని చెప్పారు. పోటీలో పాల్గొనే మహిళలు తమకు అవసరమైన ముగ్గు పిండి, రంగులను స్వయంగా తీసుకురావాలని సూచించారు. మహిళల సాంప్రదాయ కళను ప్రోత్సహించడమే లక్ష్యంగా ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముగ్గుల పోటీల్లో విజేతలుగా నిలిచిన మహిళలకు జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి చేతుల మీదుగా బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. మొదటి బహుమతిగా రూ.10,016, రెండో బహుమతిగా రూ.5,016, మూడో బహుమతిగా రూ.2,016 నగదు పురస్కారాలు అందజేయనున్నట్లు వెల్లడించారు. అదేవిధంగా పోటీలో పాల్గొన్న ప్రతి మహిళకు ప్రత్యేక బహుమతులు కూడా ఉంటాయని పేర్కొన్నారు. సంక్రాంతి సంబరాలను మరింత ఉత్సాహంగా జరుపుకోవడానికి మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోటిరెడ్డి రాజారెడ్డి పిలుపునిచ్చారు.

## బసలదొడ్డిలో తాగునీటి పైపులైన్ పనులకు రాజకీయ అడ్డంకులు

**పెద్దకడబూరు (తెలుగోడు), జనవరి 11 :**
పెద్దకడబూరు మండల పరిధిలోని బసలదొడ్డి గ్రామంలోని జగనన్న కాలనీకి గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో చేపట్టిన తాగునీటి పైపులైన్ పనులకు రాజకీయ అడ్డంకులు ఎదురయ్యాయి. దీంతో ఆదివారం తాగునీటి పైపులైన్ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. స్థానిక అధికార పార్టీ నాయకుల ఒత్తిడితో ఏకంగా గ్రామ పంచాయతీ కార్యదర్శే ఫోన్ చేసి తాగునీటి పైపులైన్ పనులను నిలిపి వేయాలని హుకుం జారీ చేసినట్లు గ్రామ సర్పంచ్ బుడ్డా అంజినమ్మ, శివరాం దంపతులు విలేఖరుల ముందు వాపోయారు. గ్రామ పంచాయతీకి విడుదలయిన 15వ ఆర్థిక సంఘం నిధులతో జగనన్న కాలనీలో ఇంటింటికి కులాయిలు ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో జేసీబీ ద్వారా తాగునీటి పైపులైన్ పనులను చేపట్టామన్నారు. అయితే ఇక్కడి అధికార పార్టీ నేతల ఒత్తిడితో పంచాయతీ కార్యదర్శే ఫోన్ చేసి పనులు నిలిపి వేయాలని హుకుం జారీ చేయడంతో పనులు నిలిపి వేశామన్నారు. గ్రామ పంచాయతీలో జరిగే అభివృద్ధి పనులకు సహకరించాల్సిన పంచాయతీ కార్యదర్శి తాగునీటి పైపులైన్ పనులను నిలిపి వేయాలని చెప్పడం ఆశ్చర్యంగా ఉందన్నారు. తక్షణమే జిల్లా అధికారులు స్పందించి గ్రామాభివృద్ధికి అడ్డు పడుతున్న పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని గ్రామ సర్పంచ్ దంపతులు డిమాండ్ చేశారు.


తాగునీటి పైపులైన్ పనులు నిలిచిపోయిన దృశ్యం

## జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన కేజీబీవీ విద్యార్థిని శృతిహాసిని

**పెద్దకడబూరు (తెలుగోడు), జనవరి 11 :**

కోసిగి గ్రామంలోని కస్తూరి బా గాంధీ బాలికల విద్యాలయంలో 8వ తరగతి చదువుతున్న పెద్దకడబూరు మండలం మేకడోణ గ్రామానికి చెందిన ఈడిగ యోగేంద్ర గౌడ్ కుమార్తె ఈడిగ శృతిహాసిని సైకిల్ పోటీల్లో జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 3 నుంచి 5 వరకు మైదుకూరులో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరచి సైకిల్ పోటీల్లో జాతీయ స్థాయికి ఎంపికైంది. జాతీయస్థాయి పోటీలు ఈనెల 10 నుంచి 13 వరకు కడప జిల్లా పులివెందులలో జరుగుతాయి. జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావడంపై ప్రిన్సిపల్ షబానా పీఈటీ సుమను, విద్యార్థినీ శృతిహాసిని ప్రత్యేకంగా అభినందించారు. జాతీయ స్థాయిలో రాణించి రాష్ట్రానికి, పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని మేకడోణ గ్రామస్తులు కోరారు.

## మలకవేముల క్రాస్‌లో ఘనంగా బండి మల్లికార్జున జన్మదిన వేడుకలు

**ముదిగుబ్బ (తెలుగోడు), జనవరి 11 :**
ముదిగుబ్బ మండలం మలకవేముల క్రాస్‌కు చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు బండి మల్లికార్జున పుట్టినరోజు వేడుకలు శుక్రవారం మలకవేముల క్రాస్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు, మిత్రులు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరై బండి మల్లికార్జునకు హృదయపూర్వక పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. వేడుకల్లో భాగంగా కేక్ కట్ చేసి ఆనందంగా సంబరాలు జరిపారు. మిత్రులు తోలేటి ఆదినారాయణ రెడ్డి, సన్నిపిరాళ్ల సాయినాథ్ బాబు, రవీంద్ర నాయక్, మాదాసు గంగాద్రి, బండి ఉదయ్ కుమార్, గుత్తా కార్తీక్ నాయుడు, బాబ్జాన్, కొత్తపల్లి వేమన్న, ముసుగు కృష్ణమూర్తి తదితరులు పాల్గొని బండి మల్లికార్జునకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకుడి సేవలను కొనియాడుతూ ఆయన మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.
ఈ సందర్భంగా బండి మల్లికార్జున మాట్లాడుతూ, స్నేహితులు, శ్రేయోభిలాషుల మధ్య పుట్టినరోజు వేడుకలు జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. తన రాజకీయ ప్రయాణంలో మిత్రుల సహకారం, ప్రజల ఆదరణ ఎంతో విలువైనదని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా పార్టీ బలోపేతానికి, ప్రజల సంక్షేమానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వేడుకల అనంతరం పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకుంటూ ఆనందంగా సంబరాలు కొనసాగాయి. మలకవేముల క్రాస్‌లో జరిగిన ఈ పుట్టినరోజు వేడుకలు ఉత్సాహభరితంగా, ఆత్మీయ వాతావరణంలో ముగిశాయి.


బండి మల్లికార్జునకు కేక్ తినిపిస్తున్న సహచరులు

## ధైర్యానికి, సాహసానికి ప్రతీక వడ్డే ఓబన్న

**ఓడి చెరువు (తెలుగోడు), జనవరి 11 :**
రేనాటి వీరుడు ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డె ఓబన్న ధైర్యానికి సాహసానికి ప్రతీక అని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి పేర్కొన్నారు. ఓడి చెరువు మండల కేంద్రంలో వడ్డే ఓబన్న జయంతి సందర్భంగా ఓబన్న విగ్రహ ఏర్పాటుకు మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి భూమి పూజ చేశారు. ముందుగా వడ్డే ఓబన్న చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ, వడ్డే ఓబన్న ఆంగ్లేయులను గడగడలాడించిన పోరాట యోధుడు అని కొనియాడారు. ఉయ్యాల వాడ నరసింహారెడ్డి కి సైన్యాధక్షుడిగా వడ్డే ఓబన్న ఎంతో నమ్మకంగా విశ్వాస పాత్రుడిగా పనిచేశారని పేర్కొన్నారు. ఈరోజు వడ్డే ఓబన్న జయంతి నీ కూటమి ప్రభుత్వం లో అధికారికంగా నిర్వహించేలా స్థానిక ఎంఎల్ఏ పల్లె సింధూర రెడ్డి అసెంబ్లీలో ప్రత్యేకంగా కోరడంతో ముఖ్యమంత్రి స్పందించి ప్రత్యేక జీవో ఇచ్చారన్నారు.

## ఘనంగా వడ్డే ఓబన్న జయంతి వేడుకలు

**పెద్దకడబూరు (తెలుగోడు), జనవరి 11 :**
పెద్దకడబూరు గ్రామంలో వడ్డే కులస్థుల ఆరాధ్య దైవం వడ్డే ఓబన్న 219 జయంతి వేడుకలు ఆదివారం వడ్డే సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వడ్డే సంఘం నాయకులు పురుషోత్తం, లింగమూర్తి, బాబు, జయరాముడు వడ్డే కులస్తుల ఆరాధ్య దైవం వడ్డే ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వడ్డే ఓబన్న చిత్రపటాన్ని మహిళలు కళసాలు చేతబూని గ్రామ పురవీధుల గుండా ఊరేగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వడ్డే ఓబన్న నంద్యాల జిల్లా సంజామలలో 1807 జనవరి 11న వడ్డే సుబ్బమ్మ, సుబ్బయ్య దంపతులకు జన్మించారన్నారు. నొస్సం పాలేగాడు ఉయ్యాల నర్సింహారెడ్డి చేసిన సాయుధ పోరాటంలో సైన్యాధ్యక్షుడుగా వడ్డే ఓబన్న వీరోచిత పాత్ర పోషించారన్నారు. వడ్డేరలు, బోయలు, చెంచులతో కూడిన సంచార తెగల సైన్యాన్ని సమర్థవంతంగా నడిపించి, దట్టమైన నల్లమల అడవుల్లో సైతం కుంఫనీ సైన్యాన్ని ఊచకోత కోసిన వీరుడు వడ్డే ఓబన్న అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో వడ్డే కులస్తులు, భక్తులు పాల్గొన్నారు.


ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వడ్డే సంఘం మండల నాయకులు


ఓబన్న చిత్రపటంతో గ్రామ పురవీధుల గుండా ఊరేగిస్తున్న దృశ్యం

## ఆర్యవైశ్యుల అభ్యున్నతికి కృషి

### రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్..

**ఆదోని (తెలుగోడు), జనవరి 11 :**
ఆర్యవైశ్యుల సమస్యలను పరిష్కరిస్తూ వారి అభ్యున్నతికి కృషి చేస్తామని రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్ అన్నారు. స్థానిక రాంబోట్ల స్వామి గుడి దగ్గర నుంచి చిన్న అమ్మవారిశాల వరకు ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో తలపెట్టిన కలశ యాత్రను ఈరోజు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా టిజి వెంకటేష్ మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాలలో ఆర్యవైశ్యులకు ఏ కష్టం వచ్చినా ఆదుకునేందుకు తాము ముందు ఉంటామని తెలిపారు. రాష్ట్ర మంత్రిగా భరత్ ఎంతగానో అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నారని, రాష్ట్రానికి పరిశ్రమలు తెచ్చేందుకు ఎంతగానో కష్టపడుతున్నారని తెలిపారు. పరిశ్రమలు ఏర్పాటుతో చదువుకున్న వైశ్య యువతకు ఉపాధి అవకాశాలు ఎంతగానో ఉంటాయని టీజీ తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఆర్యవైశ్యుల మనోబాలను గమనిస్తూ, వారి అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. మంత్రి టీజీ భరత్ చొరవతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వాసవి మాత పుట్టిన ప్రాంతమైన పెనుగొండ జిల్లాకు వాసవి మాత పెనుగొండ జిల్లాగా నామకరణం చేశారని టీజీ వెంకటేష్ తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి ఆర్యవైశ్యులు అందరి తరపున కృతజ్ఞతలు తెలుపుకుంటున్నామన్నారు. గత 20 సంవత్సరాలుగా శేషగిరి శెట్టి ఆధ్వర్యంలో కళశ యాత్రను నిర్వహిస్తున్నారని, ఇది ఎంతో పవిత్రంగా నిష్టగా చేయవలసిన కార్యక్రమం అన్నారు. ఆర్యవైశ్య సోదరీమణులు ఎంతో కష్టమైనప్పటికీ నియమనిష్ఠలతో ఈ కార్యక్రమంలో పాల్గొనడం అభినందనీయమన్నారు. ఇటువంటి కార్యక్రమాలతో భక్తి భావం పెంపొంది, క్రమశిక్షణ అలబడుతుందని టీజీ తెలిపారు. ఈ కార్యక్రమంలో లలితా పీఠం సుబ్బిస్వామి, సాయిబాబా, నాగ వీరాంజనేయులు, సుబ్రహ్మణ్యం, రవి తదితరులు పాల్గొన్నారు.


కలశయాత్రను జండా ఊపి ప్రారంభించిన రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్


కలశయాత్రలో పాల్గొన్న మహిళలు

## శ్రీశైలంలో నేటి నుంచి మకర సంక్రాంతి బ్రహ్మోత్సవాలు

**శ్రీశైలం (తెలుగోడు), జనవరి 11 :**
మకర సంక్రమణ పుణ్యకాలాన్ని పురస్కరించుకొని జనవరి 12వ తేదీ నుండి 18వ తేదీ వరకు శ్రీశైలంలో సంక్రాంతి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. పంచాహ్నికదీక్షతో ఏడురోజులపాటు జరిగే ఈ బ్రహ్మోత్సవాలు ఈనెల 18వ తేదీ ముగియనున్నాయి. సంప్రదాయాన్ని అనుసరించి శ్రీ మల్లికార్జునస్వామి వారికి ఏటా రెండుసార్లు అనగా మకర సంక్రమణం సందర్భంగా సంక్రాంతి బ్రహ్మోత్సవాలు, మహాశివరాత్రి సందర్భంగా శివరాత్రి బ్రహ్మోత్సవాలు జరుగుతాయి.

సంక్రాంతి బహ్మోత్సవాల ప్రారంభం రోజు 12వ తేదీ ఉదయం 9.15 గంటలకు శ్రీస్వామివారి యాగశాల ప్రవేశ కార్యక్రమం నిర్వహిస్తారు. తరువాత వేదపండితులు చతుర్వేద పఠనం చేస్తారు. అనంతరం లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకస్వాములు బ్రహ్మోత్సవ సంకల్పాన్ని పఠిస్తారు. సంకల్ప పఠనం తరువాత కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని గణపతి పూజ జరిపిస్తారు. గణపతి పూజ తరువాత వృద్ధి, అభ్యుదయాల కోసం స్వస్తి పుణ్యాహవాచనం జరిపిస్తారు బ్రహ్మోత్సవ నిర్వహణకు అధ్వర్యం వహించే శివపరివార దేవుడైన చండీశ్వరునికి విశేషపూజలు జరిపిస్తారు. అనంతరం కంకణధారణ, ఋత్విగ్వరణం, అఖండదీపారాధన, వాస్తుపూజ, వాస్తుహోమం, మండపారాధనలు, కలశస్థాపన, పంచావరణార్చనలు, జపానుష్ఠానములు, పారాయణలు నిర్వహిస్తారు. 12వ తేదీ సాయంకాలం 5.00 గంటల నుండి అంకురార్పణ, అగ్నిప్రతిష్ఠాపనల కార్యక్రమాలు నిర్వహిస్తారు.సాయంత్రం 7 గంటల నుండి ధ్వజారోహణ, ధ్వజపటావిష్కరణ కార్యక్రమాలు నిర్వహిస్తారు.ముక్కోటి దేవతలను, సకల సృష్టిని బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించేందుకుగాను ఈ ధ్వజారోహణ కారయక్రమం నిర్వహిస్తారు. బ్రహ్మోత్సవాలలో భాగంగానే ప్రతిరోజు శ్రీస్వామి, అమ్మవార్లకు విశేషపూజలు, మండపారాధనలు, పంచావరణార్చనలు, రుద్రహోమం, చండీహోమం, నిత్యహవనాలు జరిపిస్తారు.
బ్రహ్మోత్సవాలలో రెండవ రోజు 13వ తేదీ నుండి శ్రీస్వామి, అమ్మవార్లకు వాహన సేవలు నిర్వహిస్తారు. 13 భృంగివాహనసేవ, 14న కైలాసవాహనసేవ, 15న నందివాహనసేవ, బ్రహ్మోత్సవ కల్యాణం, 16న రావణవాహనసేవ, 17న పూర్ణాహుతి, త్రిశూలస్నానం, సదస్యం,నాగవల్లి, ధ్వజావరోహణం, 18న అశ్వవాహన సేవ, పుష్పోత్సవం, శయనోత్సవం నిర్వహిస్తారు.
15వ తేదీ మకరసంక్రాంతి రోజున బ్రహ్మోత్సవ కల్యాణం నిర్వహిస్తారు. 17వ తేదీ ఉదయం యాగపూర్ణాహుతి, కలశోద్వాసన, త్రిశూలస్నానం నిర్వహిస్తారు. సాయంత్రం సదస్యం, నాగవల్లి, ధ్వజావరోహణ కార్యక్రమాలు నిర్వహిస్తారు. బ్రహ్మోత్సవాలలో చివరిరోజైన 18వ తేదీ రాత్రి జరిగే పుష్పోత్సవం, శయనోత్సవం, ఏకాంతసేవలతో ఈ ఉత్సవాలు ముగుస్తాయి.

**కొన్ని ఆర్జిత సేవలు నిలుపుదల..**
సంక్రాంతి బ్రహ్మోంమత్సవాల సందర్భంగా ఈనెల 12వ తేదీ నుండి 18వ తేదీ వరకు ఆర్జిత, ప్రత్యక్ష పరోక్షసేవలైన రుద్రహోమం, మృత్యుంజయహోమం, శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి కల్యాణం, శ్రీ స్వామిఅమ్మవార్ల కల్యాణం, ఏకాంతసేవ, గణపతి హోమం ( పరోక్షసేవ) ఉదయాస్తమానసేవ, ప్రదోషకాల సేవ, ప్రాత:కాల సేవలను నిలపుదల చేస్తున్నట్లు కార్య నిర్వహణ అధికారి ఎం శ్రీనివాసరావు తెలిపారు.



విద్యుత్ దపాల వెలుగులో రాజగోపురం


విద్యుత్ దపాల వెలుగులో శ్రీశైల మల్లన్న ఆలయం



## ఆంధ్రప్రదేశ్ ద్రోహిగా చంద్రబాబు చరిత్రలో మిగిలిపోతారు

### కూటమి ప్రభుత్వాన్ని గవర్నర్ వెంటనే భర్తరఫ్ చేయాలి .. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర రైతు విభాగం అధికార ప్రతినిధి గడ్డం నారాయణ రెడ్డి ..

**ఎమ్మిగనూరు (తెలుగోడు), జనవరి 11 :**
తెలంగాణ అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన తాజా వ్యాఖ్యల నేపథ్యంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చరిత్రలో రాయలసీమ ద్రోహిగా నిలిచిపోతారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర రైతు విభాగ అధికార ప్రతినిధి, నియోజకవర్గ సీనియర్ నాయకులు గడ్డం నారాయణ రెడ్డి అన్నారు. పట్టణంలోని తమ స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు పాలనలో అమరావతి తప్ప రాయలసీమ ప్రాంతానికి నిధులు గానీ, సాగునీటి ప్రాజెక్టులు గానీ పట్టించుకున్న దాఖలాలు లేవని మండిపడ్డారు.రాయలసీమ ప్రజల జీవనాధారమైన సాగునీటి అంశంలో తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు పరస్పరం కుమ్మక్కై తీవ్ర అన్యాయానికి పాల్పడుతున్నారని ఆరోపించారు.రాయలసీమకు నీళ్లు రాకుండా అడ్డుకుంటున్న చంద్రబాబు తమ స్వలాభం, రాజకీయ ప్రయోజనాల కోసమే రాయలసీమ ప్రజల జీవనాడిగా చెప్పుకునే కృష్ణా జలాలు సీమకు చేరకుండా అడ్డుకట్ట వేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.రాయలసీమ ప్రాంతానికి చంద్రబాబు నాయుడు చేసిన ఈ దుర్మార్గాన్ని వైఎస్సార్‌సీపీ తీవ్రంగా ఖండిస్తోందని లేని యెడల మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి సూచనలతో రాయలసీమ రైతులతో కలిసి ఎమ్మిగనూరు నియోజకవర్గ ఇంచార్జ్ ఎర్రకోట రాజీవ్ రెడ్డి గారి ఆధ్వర్యంలో ఉద్యమ బాట పట్టాల్సి వస్తుందని హెచ్చరించారు.



## సంక్రాంతి పండగల వేళ పందేల జోలికెళ్లొద్దు

### డిఐజి , కర్నూలు ఇన్‌చార్జీ ఎస్పీ విక్రాంత్ పాటిల్ ..


**ఆదోని (తెలుగోడు), జనవరి 11 :**
సంక్రాంతి పండగ నేపథ్యంలో పందెంల జోలికెళ్లొద్దని డిఐజి, కజిల్లా ఇన్‌చార్జీ ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. సంప్రదాయ క్రీడలు మాత్రమే ఆడాలని సూచించారు. పేకాట, జూదం, కోడి పందెంలు, గుండాట వంటి తదితర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లా కేంద్రంతో పాటు పట్టణాలు, గ్రామాలు, శివారు ప్రాంతాల్లో కోడి పందెంలు, జూదాలు, ఇతర చట్టవ్యతిరేక ఆటలు పూర్తిగా నిషేధం అన్నారు. ఎవరైనా కోడి పందెంలు ఆడినా, ప్రోత్సహించినా, నిర్వహించినా చర్యలు తప్పవన్నారు. జిల్లాలో ఎక్కడైనా కోడిపందెంలు, పేకాట, జూదం, గుండాట వంటి ఇతర అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తుంటే డయల్ 112 లేదా డయల్ 100కు, స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని డిఐజి విక్రాంత్ పాటిల్ తెలిపారు.


ఎస్ఐ నిరంజన్ రెడ్డిని అభినందిస్తున్న టీడీపీ నేతలు

## ఎస్ఐ నిరంజన్ రెడ్డిని అభినందించిన ఐ టీడీపీ నేతలు

**పెద్దకడబూరు (తెలుగోడు), జనవరి 11 :**
సర్టిఫికెట్ ఆఫ్ ఎక్సలెన్సీ అవార్డు - 2026 డీజీపీ నుంచి అందుకున్న పెద్దకడబూరు ఎస్ఐ నిరంజన్ రెడ్డిని ఆదివారం స్తానిక పోలీసు స్టేషన్ లో ఐ టీడీపీ నేతలు ప్రత్యేకంగా అభినందించారు. ఐ టీడీపీ తాలూకా ఉపాధ్యక్షులు కురువ కృష్ణ, బసలదొడ్డి గ్రామ టీడీపీ నాయకులు బొంపల్లి సత్యనారాయణ రాష్ట్రంలో పెద్దకడబూరు పోలీసు స్టేషన్ కు అత్యుత్తమ అవార్డు లభించినందుకు ఎస్ఐ నిరంజన్ రెడ్డికి శాలువా కప్పి పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. అలాగే హులికన్వి గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు నల్లారెడ్డి ఎస్ఐ నిరంజన్ రెడ్డికి శాలువా కప్పి పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. పెద్దకడబూరు పోలీసు స్టేషన్ ను రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలపడం అభినందనీయమని వారు స్పష్టం చేశారు.


ఎస్ఐ నిరంజన్ రెడ్డిని సన్మానిస్తున్న హులికన్వి నాయకులు



# పాపం తమిళంలో కూడా కలసి రావడంలేదు

అందాల భామ శ్రీలీల కు అదృష్టం కలిరావడం లేదు అని చెప్పడంలో ఎలాంటి ఆశ్చర్యం లేదు. మొదటి సినిమా రిలీజ్ అవ్వకుండానే వరుస ఆఫర్స్ అందుకున్న హీరోయిన్ గా శ్రీలీలకు ఒక రికార్డ్ ఉంది. స్టార్ హీరోలు, కుర్ర హీరోలు.. ఇలా తేడా లేకుండా అందరితో నటించింది. కానీ, ఏం ప్రయోజనం.. అమ్మడి కెరీర్ లో ఒక్క హిట్ తప్ప మిగతావి అన్ని పరాజయాలే. శ్రీలీల ఏ సినిమా చేసినా.. దీంతో బ్రేక్ వస్తుంది అని ఆశ పడడం.. ఆ తరువాత దీంతో కూడా లేదా అని నిరాశ పడడం అభిమానులకు అలవాటుగా మారిపోయింది. ఒకటి కాదు రెండు కాదు.. దాదాపు ధమాకా తరువాత శ్రీలీల చేసిన అన్ని సినిమాలు పరాజయం పాలయ్యాయి. సరే తెలుగు ఇండస్ట్రీ అంతగా అచ్చిరాలేదేమో.. మన లక్ తమిళ్ లో ప్రయత్నిద్దామని శ్రీలీల పరాశక్తితో కోలీవుడ్ ఎంట్రీ ఇచ్చింది. శివకార్తికేయన్ హీరోగా సుధా కొంగర దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాలో రవి మోహన్ విలన్ గా నటించగా.. అథర్వ కీలక పాత్రలో నటించాడు. ఇక శివకార్తికేయన్ సరసన శ్రీలీల కనిపించింది. ఈ సినిమాపై అభిమానులు భారీ అంచనాలను పెట్టుకున్నారు. ఎన్నో అంచనాల మధ్య జనవరి 10 న రిలీజైన పరాశక్తి మొదటి షో నుంచి మిక్స్ టాక్ ను అందుకుంటుంది.కథ బాగానే ఉన్నా కథనంలో చాలా లోపాలు కనిపించాయని చెప్పుకొస్తున్నారు. నటీనటుల నటన బావున్నా.. ఇంకా వాడుకోలేదని అంటున్నారు. కొంతమంది శ్రీలీల యాక్టింగ్ సెట్ అవ్వలేదని, సుధా కొంగర సినిమాల్లో హీరోయిన్ చాలా పవర్ ఫుల్ గా కనిపిస్తుందని, కానీ రత్నమాలగా శ్రీలీల అంత పవర్ ఫుల్ గా లేదని పెదవి విరుస్తున్నారు. ఈ సినిమా కోసం ఈ చిన్నది చాలా కష్టపడింది. లుక్ మొత్తం మార్చేసింది. అయినా కూడా విజయాన్ని మాత్రం దక్కించుకోలేకపోయింది. పాపం ఈ చిన్నదాన్ని పరాశక్తి కూడా కాపాడలేకపోయింది. తమిళ్ లో కూడా శ్రీలీలకి మొదటి సినిమా కష్టంగానే మారింది. మరి ముందు ముందు పరాశక్తి మంచి టాక్ ని అందుకొని పైకి లేస్తే.. ఏమైనా శ్రీలీలకు వేరే ఛాన్స్ లు రావడానికి ఉపయోగపడుతుందేమో చూడాలి.

# ఈరోజు నాకు చాలా ప్రత్యేకమైనది -బన్నీ



గంగోత్రి సినిమాతో తెలుగు తెరకు పరిచయమైనా.. అది హిట్ అయినా కూడా బన్నీని వెనక్కి తిరిగి చూడకుండా చేసిన సినిమా మాత్రం ఆర్య అనే చెప్పాలి.ఇక స్టార్ హీరోగా కొనసాగుతున్నా పాన్ ఇండియా లెవెల్ హీరోగా నిలబెట్టిన సినిమా మాత్రం పుష్ప అనే చెప్పాలి. ఇలా అల్లు అర్జున్ ని ఒక స్థాయిలో నిలబెట్టిన డైరెక్టర్ ఎవరు అంటే కచ్చితంగా సుకుమార్ పేరు మాత్రమే వినిపిస్తుంది. అందుకే సుకుమార్ అంటే అల్లు అర్జున్ కు అమితమైన ఇష్టం. నేడు సుకుమార్ 56 వ పుట్టినరోజును జరుపుకుంటున్నాడు. ఉదయం నుంచి అభిమానులతో పాటు స్టార్స్ కూడా సుకుమార్ కి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. తాజాగా అల్లు అర్జున్ సైతం.. సుక్కుకు బర్త్ డే విషెస్ చెప్పుకొచ్చాడు. పుష్ప సమయంలో సుకుమార్ తో కలిసి దిగిన ఫోటోను షేర్ చేస్తూ.. తన జీవితాన్ని మార్చిన వ్యక్తి సుకుమార్ అని చెప్పుకొచ్చాడు బన్నీ. ‘ పుట్టినరోజు శుభాకాంక్షలు, సుకుమార్ డార్లింగ్. ఈ రోజు నీకంటే నాకే చాలా ప్రత్యేకమైనది... ఎందుకంటే ఈ రోజు నా జీవితాన్ని మార్చేసింది. నా జీవితంలో నువ్వు ఉన్నందుకు నేను పొందే ఆనందాన్ని ఎన్ని పుట్టినరోజులకు శుభాకాంక్షలు చెప్పినా వ్యక్తపరచలేను’ అంటూ చెప్పుకొచ్చాడు.ఇక చివర్లో పుట్టినందుకు థంక్స్ అని నవదీప్ స్టైల్లో చెప్పుకొచ్చాడు. నవదీప్ ప్రతి ఏడాది.. బన్నీ బర్త్ డే కి పుట్టినందుకు థంక్స్ బావ అని చెప్తాడు. అదే డైలాగ్ ని బన్నీ సుకుమార్ కి వాడడంతో ఆ కాపీ రైట్స్ కూడా నవదీప్ కే ఇచ్చేసాడు. ప్రస్తుతం ఈ పోస్ట్ నెట్టింట వైరల్ గా మారింది. బన్నీ - సుకుమార్ కలయికలో ఇప్పటికీ నాలుగు సినిమాలు వచ్చాయి. ఆర్య, ఆర్య 2, పుష్ప, పుష్ప 2. ఇక త్వరలోనే పుష్ప 3 కూడా మొదలు కానుందని తెలుస్తోంది. వీరిద్దరి బంధం ఇలానే కలకాలం కొనసాగాలని ఫ్యాన్స్ కామెంట్స్ పెడుతున్నారు.

# విజయ్ కథను నమ్మాడు



టాలీవుడ్ లో పరాజయమే ఎరుగని దర్శకుల్లో అనిల్ రావిపూడి ఒకరు. పటాస్ దగ్గర నుంచి సంక్రాంతికి వస్తున్నాం వరకు విజయాలను మాత్రమే అందుకున్నాడు. ఇక ప్రస్తుతం ఆ విజయ పరంపరను కొనసాగించడానికి మన శంకరవరప్రసాద్ గారు సినిమాతో రాబోతున్నాడు. మెగాస్టార్ చిరంజీవి, నయనతార జంటగా నటించిన ఈ సినిమా సంక్రాంతి కానుకగా జనవరి 12 న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే ఈ చిత్రం నుంచి రిలీజైన సాంగ్స్, ట్రైలర్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఇప్పటికే ఈ సినిమాపై పాజిటివ్ టాక్ కూడా క్రియేట్ అయ్యింది.ఇక మన శంకరవరప్రసాద్ గారు సినిమా ప్రమోషన్స్ లో పాల్గొన్న అనిల్ రావిపూడి.. విజయ్ జన నాయకుడు సినిమా గురించి మాట్లాడాడు. అనిల్ దర్శకత్వంలో తెరకెక్కిన భగవంత్ కేసరి సినిమాకు రీమేక్ గానే జన నాయకుడు తెరకెక్కింది. కోలీవుడ్ నేటివిటీకి తగ్గట్లు ఈ కథలో కొన్ని మార్పులు చేర్పులు చేశారు. ఇక అన్ని బావుండి ఉంటే జన నాయకుడు రిలీజ్ అయ్యి మూడు రోజులు అయ్యేది. కానీ, సెన్సార్ సమస్యల వలన ఈ సినిమా వాయిదా పడింది.తాజాగా భగవంత్ కేసరి సినిమానే జన నాయకుడుగా తెరకెక్కించారు.. దానిపై మీ అభిప్రాయం ఏంటి అన్న ప్రశ్నకు అనిల్ రావిపూడి మాట్లాడుతూ.. ‘ కచ్చితంగా విజయ్ చివరి చిత్రం ఎప్పుడు వచ్చినా రికార్డులు షేక్ అవుతాయి. మొదట.. విజయ్ ఈ సినిమాకు నన్నే డైరెక్ట్ చేయమని అడిగాడు. కానీ, నేను ఏదైనా స్ట్రెయిట్ సబ్జెక్టు చేస్తానని చెప్పాను. అంటే పర్సనల్ గా విజయ్ చివరి చిత్రం.. రీమేక్ అంటే ఎలా ఉంటుందో అని భయపడ్డాను. అందుకని నేను ధైర్యం చేయలేదు. విజయ్ కి మాత్రం ఈ సినిమా బాగా నచ్చింది. కొన్ని ఎలిమెంట్స్ బాగా బాగా నచ్చాయి. అందుకే ఆయన పట్టుబట్టి చేశారు. చాలామంది రీమేక్ ఎందుకు అన్నా కూడా ఏదో ఉందని నమ్మాడు. విజయ్ యాక్టింగ్ సినిమాకు మరింత బలం అవుతుంది’ అని చెప్పుకొచ్చాడు

# నగ్నంగా చెట్టెక్కిన హీరో..

బాలీవుడ్ హీరో విద్యుత్ జమాల్ గురించి తెలుగు ప్రేక్షకులకు సైతం ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. యాక్షన్ హీరోగా అతనికి సపరేట్ ఫ్యాన్ బేస్ ఉంది. ఇక తమిళ్ లో కొన్ని సినిమాల్లో విలన్ గా కూడా నటించాడు. విజయ్ నటించిన తుపాకీ సినిమాలో విలన్ గా నటించిన విద్యుత్ కి మంచి గుర్తింపు వచ్చింది. ఆ తరువాత సూర్య సికిందర్ లో కూడా ఆమంచి పాత్రలో మెప్పించాడు. ఇక కమాండో సిరీస్ లలో హీరోగా నటించాడు. గతేడాది రిలీజైన శివ కార్తికేయన్ మదరాసిలో కూడా విద్యుత్ విలన్ గా కనిపించాడు.ఇక సినిమాల విషయం పక్కన పెడితే.. విద్యుత్ ఎక్కువగా కలరిపయట్టు సాధనలోనే కనిపిస్తాడు. హిమాలయాల్లో.. మంచు ప్రదేశాల్లో ఒంటిపై నూలు పోగు లేకుండా సాధన చేస్తూ కనిపిస్తాడు. తాజాగా విద్యుత్.. నగ్నంగా చెట్టు ఎక్కుతున్న వీడియోను అభిమానులతో షేర్ చేశాడు. కలరిపయట్టు సాధనలో భాగంగానే తాను ఇలా చెట్టు ఎక్కినట్లు చెప్పుకొచ్చాడు.

‘కలరిపయట్టు సాధకుడిగా, నేను సంవత్సరానికి ఒకసారి సహజ యోగ సాధనలో మునిగిపోతాను. సహజ అంటే సహజ సౌలభ్యం మరియు సహజమైన స్థితికి తిరిగి రావడం, ప్రకృతితో మరియు అంతర్గత అవగాహనతో లోతైన సంబంధాన్ని పెంపొందించడం. శాస్త్రీయంగా, ఇది అనేక న్యూరోరిసెప్టర్లు మరియు ప్రొప్రియోసెప్టర్లను సక్రియం చేస్తుంది, ఇంద్రియాలను మెరుగుపరుస్తుంది. సమతుల్యత మరియు సమన్వయాన్ని మెరుగుపరుస్తుంది. ఇది ఎక్కువగా శరీర అవగాహన, మానసిక దృష్టి పెరుగుదలకు దారితీస్తుంది’ అని చెప్పుకొచ్చాడు. ప్రస్తుతం ఈ వీడియో నెట్టింట వైరల్ గా మారింది.



Publisher and Owned by S.BABAJAN, Main Road, Nallamada, ANANTHAPUR, Andhrapradesh-515501. Printed At SUNDAY PRINTING PRESS, SVN Coliny, Gunturu... EDITOR- B.SHANKAR PRASAAD, PRGI No- APTEL/25/A2739 ..Cell No - 99634 96956, 73827 12780.